RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 299 మేడ్చల్ మల్కాజ్‌గిరి 20 నవంబర్ 2024 బుధవారం పేజీలు : 4

## ఢిల్లీలో కాలుష్యం తీవ్రం.. బడుల మూసివేత

న్యూఢిల్లీ : ఢిల్లీ కాలుష్యం తీవ్రంగా పరిణమించిన నేపథ్యంలో నాలుగో దశ కార్యాచరణ ప్రణాళిక(జీఆర్‌ఏపీ-4)ను అమల్లోకి తెచ్చారు. ఇందులో భాగంగా పాఠశాలలను మూసేశారు. 11, 12 తరగతులకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తున్నారు. సాఫ్ట్‌వేర్, ఇతర ఐటీ అనుబంధ సంస్థలను వర్క్‌ఫ్రమ్ హోంకు అనుమతించాలని ఆదేశించారు. ఆరు బయట కార్యకలాపాలను పూర్తిగా నిషేధించారు. సాధారణ నిర్మాణాలు, కూల్చివేతలను ఇప్పటికే ఆపేయగా, కీలక మౌలిక ప్రాజెక్టుల నిర్మాణాలను కూడా నిలిపేశారు. నిత్యావసరాల సరకు రవాణా తప్ప మిగతా అన్ని సరకు రవాణా వాహనాలను నగరంలోకి రాకుండా ఆపేశారు.

# కుట్రలు, కిరాయి రౌడీలతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

## ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

### హనుమకొండ ప్రజాపాలన విజయోత్సవ సభకు అశేషంగా తరలి వచ్చిన ప్రజానీకం




హనుమకొండ: వరంగల్‌ను అభివృద్ధి చేస్తే సగం తెలంగాణను వృద్ధిలోకి తీసుకొచ్చినట్లేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణకే తలమానికంగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ జిల్లా మంత్రి, ఇన్‌ఛార్జ్ మంత్రి పట్టుబట్టి అభివృద్ధి పనులను సాధించుకున్నారని చెప్పారు. ఏడాది పాలన పూర్తి సందర్భంగా హనుమకొండ లోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన విజయోత్సవ సభలో సీఎం పాల్గొన్నారు.

విమానాశ్రయంతో వరంగల్ రూపురేఖలు మారనున్నాయన్నారు. చాలా రాష్ట్రాల్లో నాలుగైదు విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణ లో మాత్రం ఇప్పటివరకు ఒకేఒక ఎయిర్‌పోర్టు ఉందన్నారు. గత ప్రభుత్వం చేయలేని పనులు తాము చేస్తుంటే పనులు చేస్తుంటే కుట్రలు, కిరాయి రౌడీలతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. దుర్బుద్ధితో అభివృద్ధి పనులను అడ్డుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇందిరమ్మ రాజ్యం రావాలని ప్రజలంతా కోరుకున్నారని.. తమను దీవించి పదవులిచ్చిన ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మార్చేందుకు ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. గత ప్రభుత్వంలో కొన్నేళ్లపాటు మహిళా మంత్రి కూడా లేరని గుర్తు చేశారు. కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లపాటు మనసొప్పలేదని, ఎంతో పట్టుదలతో కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేశామన్నారు. "వరంగల్ గడ్డ నుంచి రైతులందరికీ మరోసారి మాట ఇస్తున్నా. సాంకేతిక కారణాల వల్ల కొందరికి రూ. 2లక్షలలోపు రుణమాఫీ వర్తించలేదు. ఇచ్చిన మాట ప్రకారం రుణాలన్నీ మాఫీ చేస్తాం" అని సీఎం ప్రకటించారు.

**ఒక్కసారి ఓడిస్తే.. మళ్లీ ప్రజల మొహం చూడరా?...** భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మాట ఇచ్చి.. పదేళ్లలో రుణమాఫీ చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆరు నెలల్లోనే రుణమాఫీకి రూ. 18వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఒక్కసారి ఓడిస్తే.. మళ్లీ ప్రజల మొహం చూడరా? అధికారం ఇస్తే దోచుకోవడం.. ఓడిస్తే ఫామ్‌హౌస్‌లో కూర్చోవడమేనా మీ పని అని ప్రశ్నించారు. ప్రజల మీద ప్రేమ ఉంటే ఎందుకు ప్రజల మధ్యకు రావడం లేదని నిలదీశారు. నిజంగా ప్రజలు కష్టాల్లో ఉంటే వాళ్ల మధ్యకు వచ్చి ఎందుకు అడగటం లేదన్నారు. రాహుల్ గాంధీని చూసి కేసీఆర్ బుద్ధి తెచ్చుకోవాలన్నారు. మూడుసార్లు అధికారం దక్కకపోయినా.. రాహుల్ గాంధీ ప్రజల మధ్యే ఉన్నారని గుర్తు చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తన బాధ్యతను ఎందుకు నిర్వర్తించడం లేదని నిలదీశారు. తెలంగాణను అవమానించిన, వ్యతిరేకించిన ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఊడిగం చేస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. గెలిపించిన సికింద్రాబాద్ ప్రజలను కిషన్ రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. గుజరాత్‌లో సబర్మతి సుందరీకరణను సమర్థించి.. మూసీ సుందరీకరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ధ్వజమెత్తారు.

**రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతున్నాం: భట్టి...** అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. హనుమకొండలో ప్రజా పాలన విజయోత్సవ సభలో భట్టి మాట్లాడారు. "వచ్చే పదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల మేర వడ్డీ లేని రుణాలిస్తాం. వారిని లక్షాధికారులను చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చే కార్యక్రమాలను చేపడుతున్నాం. సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసే అవకాశం వారికి కల్పిస్తున్నాం" అని భట్టి తెలిపారు. వరంగల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. డిజిటల్ విధానంలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించారు. కాళోజీ జీవిత విశేషాలను తెలిపేలా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫొటో ప్రదర్శనను సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు తిలకించారు. కళాక్షేత్రం ముందు ఏర్పాటు చేసిన కాళోజీ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు.




## టిడిపిలో చేరికకు రంగం సిద్ధం

## చంద్రబాబునాయుడు గ్రీన్‌సిగ్నల్

### తెలంగాణ తెలుగుదేశం పగ్గాలు అప్పగించే అవకాశం

### ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి

### హైదరాబాద్ రాగానే కీలక పరిణామాలు

హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలుగు దేశం పార్టీలో చేరికకు రం గం సిద్ధమైనట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మల్లారెడ్డి తిరిగి రా గానే ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి , టీడీపీ అధినేత నారా చంద్ర బాబు సమక్షంలో తరువాయి టీడీపీ కండువా కప్పుకోనున్నారని ఈ వర్గాల సమాచారం. మల్లారెడ్డి పార్టీలో చేరగానే ఆయనను తెలంగాణ రాష్ట్ర టిడిపి అధ్యక్షునిగా నియమించాలని చంద్రబాబు నాయుడు భావిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే మల్లారెడ్డితో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని చర్చించినట్టు సమాచారం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇక్కడ టీడీపీ పూర్తిగా ఉనికికోల్పోయిన విషయం తెలిసిందే. కాగా ఆంధ్రప్రదేశ్‌లో టిడీపీ తిరిగి అధికారంలోకి రావడంతో తెలంగాణ లో తిరిగి పార్టీకి పూర్వ వైభవం తీసుకరావాలని చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఆ దిశగా ఇటీవల తెలంగాణ టీడీపీ నాయకులతో చంద్రబాబు నాయుడు పలుమార్లు సమావేశమై చర్చించారు. తెలంగాణలో బలమైన రెడ్డి సామాజిక వర్గంతో పాటు ఆర్థికబలం కలిగిన మల్లారెడ్డికి పార్టీ పగ్గాలు అప్పజెప్పితే పార్టీకి పూర్వవైభవం తీసుకరావడానికి కలిసి వస్తుందని చంద్రబాబు నాయుడు అంచనా వేస్తున్నట్టు ఈ వర్గాల సమాచారం. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో రెడ్డి సామాజిక వర్గం నాయకులను పక్కన బెట్టి బీసీ కార్డును ప్రయోగించి పార్టీని బలోపేతం చేయాలని చంద్రబాబు నాయుడు భావించారు. ఈ మేరకు టీడీపీ అధికారంలోకి వస్తే బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆర్ కృష్ణయ్య తమ పార్టీ సీఎం అభ్యర్థిగా కూడా చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయం తెలిసిందే. రెండు కండ్ల సిద్ధాంతం నినాదంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును చివరి దాకా చంద్రబాబు నాయుడు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో టీడీపీకి ఆంధ్రపార్టీగా ముద్రపడటంతో ఆ పార్టీ ఇక్కడ తన ఉనికిని కోల్పోవలసి వచ్చింది. ఇలా ఉండగా తెలంగాణలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారం లోకి రావడంతో మల్లారెడ్డి భూకబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. దీంతో రాజకీయాలకంటే తన వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవడమే ముఖ్యమని భావించిన మల్లారెడ్డి కేంద్రంలో అధికారంలో ఉన్న బీ జేపీలో చేరడానికి ప్రయత్నించి భంగపడ్డారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీతో కలిసి టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, కేంద్రంలో భాగస్వామ్య పక్షంగా ఉండటం, దానికి టీడీపీ మద్దతు కీలకంగా మారడంతో కేంద్రప్రభుత్వ పెద్దల వద్ద చంద్రబాబు నాయుడికి పలుకుబడి పెరిగింది. దొడ్డిదారిలో అయినా కేంద్ర ప్రభుత్వ పెద్దల మద్దతు పొందాలంటే టీడీపీలో చేరడం ఉత్తమమని మల్లారెడ్డి అంచనా వేసారు. తన విద్యా సంస్థలు, ఇతర వ్యాపారాలపై కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులను తప్పించుకోవడంతో చంద్రబాబు నాయుడుతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి సత్సంబంధాలు ఉండటంతో కాంగ్రెస్‌లో చేరడం కంటే టీడీపీలో చేరడం వల్ల అటు కేంద్రం, ఇటు రాష్ట్రం రెండింటికీ టార్గెట్ కాకుండా తప్పించుకోవచ్చని మల్లారెడ్డి వ్యూహాత్మకంగా టీడీపీలో చేరడానికి సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ మేరకు తన ఆసక్తిని చంద్రబాబు నాయుడిని కలిసి మల్లారెడ్డి చెప్పడంతో ఆయన సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. ఇందులో భాగంగా మల్లారెడ్డి టీడీపీలో చేరిక, తెలంగాణ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా పగ్గాలు చేపట్టడం ఇక లాంఛనప్రాయమే అని ఈ వర్గాల సమాచారం. విద్యాసంస్థల అధిపతి, వ్యాపారవేత్త అయిన మల్లారెడ్డి గతంలో టీడీపీలో చేరి ఆ పార్టీ నుంచి మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన విషయం తెలిసిందే . ఆ తరువాత ఆయన బీఆర్‌ఎస్‌లో చేరి 2018లో మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి కూడా అయ్యారు . మూడవసారి కూడా తిరిగి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందన్న అంచనాతో మల్లారెడ్డి అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డితోనే కయ్యానికి కాలు దువ్వారు. అయితే ఆయన అంచనాలు తలకిందులై రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రేవంత్‌రెడ్డి ఏకంగా సీఎం కావడంతో కేంద్రంలో ఎన్‌డీఏలో భాగస్వామ్యపక్షంగా ఉన్న టీడీపీలో చేరడం వల్ల తనకు రాజకీయంగా రక్షణ లభిస్తుందని మల్లారెడ్డి తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్టు తెలిసింది. మల్లారెడ్డి టీడీపీలో చేరబోవడానికి ఇదే ప్రధాన కారణమని అయి ఉంటుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కాగా రెడ్డి సామాజిక వర్గానికే చెందినా మరో నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఇప్పటికే తాను టీడీపీలో చేరబోతున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.




## బీజేపీకి రాజాసింగ్ గుడ్ బై!

తెలంగాణ బీజేపీలో మరోసారి %మీూా% రాజాసింగ్ వ్యవహారంపై చర్చ సాగుతోంది. బీజేపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నిద్రలో రాజాసింగ్ ఎక్కడా కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. రాజాసింగ్ను బీజేపీ నాయకత్వం అస్సలు పరిగణలోకి తీసుకోలేదని తెలుస్తోంది. అంబర్పేట్, పాతబస్తీ, బోడుప్పల్ వరకు మూసీ నిద్ర కార్యక్రమం జరిగింది. కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాల్లో రాజా సింగ్ కనిపించడం లేదు. మూసీ నిద్రలో కీలక నేతలంతా పాల్గొన్న రాజా సింగ్ మాత్రం పాల్గొనలేదు.

**పార్టీపై ఆగ్రహం..** అయితే.. గత కొంత కాలంగా పార్టీ రాష్ట్ర నాయకత్వంపై రాజాసింగ్ గుర్రుగా ఉన్నారు. అసెంబ్లీలో బీజేఎల్పీ పదవిని ఆయన ఆశించి భంగపడ్డారు.

3 సార్లు MLAగా గెలిచినా పట్టించుకోవడం లేదంటూ ఆయన ఫైర్ అవుతున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్లో పార్టీ తరఫున గెలిచిన ఏకైక BJP ఎమ్మెల్యే తానని.. ఈ నేపథ్యంలో తనకు కీలక పదవి ఇవ్వాలని ఆయన పార్టీ నాయకత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి తాను అర్హుడినని ఆయన అంటున్నారు. అయితే.. పార్టీలో యాక్టీవ్ గా ఉండకపోయినా కూడా MIMపై సమయం వచ్చినప్పుడల్లా తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు.




## కాంగ్రెస్ చేతిలో ప్రజలు దగా పడ్డారు..

### సీఎం రేవంత్‌పై హరీష్‌రావు ధ్వజం

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు జరపాల్సింది విజయోత్సవాలు కాదు.. అపజయోత్సవాలు జరపాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు విమర్శలు చేశారు. అన్ని వర్గాలను సక్సెస్ ఫుల్‌గా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఎద్దేవా చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ వేదికగా అన్ని వర్గాల ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్ డిక్లరేషన్, మహిళలకు ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయాలని కోరారు. పది నెలల్లో రాష్ట్రాన్ని పదేళ్ల వెనక్కి తీసుకువెళ్లారని ఆరోపించారు. ఇవాళ(మంగళవారం) కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు.

**విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు..** "ఎవరనుకున్నారు ఇట్లవున్నానని.. ఎవరునుకున్నారు ఇట్లవున్నానని' ప్రజాకవి కాళోజీ నినదించినట్లు కాంగ్రెస్ చేతిలో ప్రజలు దగా పడ్డారు. రైతులు దారుణంగా మోసపోయారు. ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు, అపజయాలను కప్పిపుచ్చుకునేందుకు వరంగల్ వేదికగా విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు. ఏం సాధించారని సంబురాలు జరుపుకుంటున్నారు రేవంత్ రెడ్డి. ఇదే వరంగల్ వేదికగా ఇచ్చిన రైతు డిక్లరేషన్‌కు ఏడాది అయినా అతీగతీ లేదు. డిక్లరేషన్‌లో చెప్పిన మొట్ట మొదటి హామీ రూ. 2లక్షల రుణమాఫీ ఇంకా పూర్తి చేయలేదు. రైతులు, కౌలు రైతులకు ఇస్తామన్న రూ. 15వేల భరోసా దిక్కులేదు. ఉపాధి హామీ రైతు కూలీలకు ఏడాదికి ఇస్తాన్న రూ. 12వేలు ఇవ్వనేలేదు. పది రకాల పంటలకు ఇస్తామన్న బోనస్ బోగస్ చేశారు. ఆనాడు మీరు ఇచ్చిన 9 హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదు. ఇందుకేనా మీ వరంగల్ విజయోత్సవ సభ రేవంత్ రెడ్డి. మీ పది నెలల పాలనలో రాష్ట్రాభివృద్ధి పదేళ్ల వెనక్కి వెళ్లింది" అని హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు.

**నేడు తిరోగమనంలో తెలంగాణ..** "కేసీఆర్ పాలనలో అద్భుతంగా పురోగమించిన తెలంగాణ, నేడు తిరోగమనం బాట పట్టింది. అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలియజేసే దుస్థితి. వద్దురో నాయనా కాంగ్రెస్ పాలన అంటూ పాటలు పాడుకుంటున్న పరిస్థితి. పురుగుల్లేని భోజనం కోసం గురుకుల పిల్లలు, స్కాలర్ షిప్పుల కోసం విద్యార్థులు, ఉద్యోగాల కోసం నిరుద్యోగులు, రుణమాఫీ, రైతు బంధు కోసం రైతన్నలు, జీతాల కోసం ఆశాలు, అంగన్ వాడీలు, డీఏ, పీఆర్సీ కోసం ప్రభుత్వ ఉద్యోగులు నిధులు విడుదల చేయాలంటూ గ్రామ పంచాయతీ సిబ్బంది, ఫార్మా కంపెనీలను వ్యతిరేకిస్తూ పల్లె ప్రజలు, ఇళ్లు కూలగొట్టొద్దని హైడ్రా బాధితులు, సమస్యలు పరిష్కరించాలంటూ పోలీసులు , పింఛన్లు పెంచాలంటూ వృద్ధులు, బడిలో చదువుకునే పిల్లల నుంచి పింఛన్లు అందుకునే అవ్వాతాతల వరకు అందర్నీ సక్సెస్ ఫుల్‌గా రోడ్ల మీదకు తెచ్చారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో అన్ని వర్గాలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటే, పది నెలల పాలనలో నువ్వు అందరి కడుపు కొట్టావు. నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచావు" అని హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఇప్పటికైనా కళ్లు తెరవండి..** "మీరు జరుపుకోవాల్సింది విజయోత్సవాలు కాదు రేవంత్ రెడ్డి, సక్సెస్ ఫుల్‌గా ప్రజల్ని మోసం చేసినందుకు అపజయోత్సవాలు జరుపుకోవాలి. ఏడాది కావొస్తుంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. అద్భుతాలు చేశామనే భ్రమ నుంచి బయటపడి ఇచ్చిన హామీలు అమలు చేయండి. గోబెల్స్ ప్రచారాలు పక్కన బెట్టి పరిపాలన మీద దృష్టి సారించండి. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయండి. మీ వైఫల్యాలను గుర్తించి మోసం చేసినందుకు వరంగల్ వేదికగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. మాట ఇచ్చాం, పూర్తి చేశామని మహిళలకు ఇచ్చిన హామీల పట్ల కోట్లు వెచ్చించి ప్రకటనలు జారీ చేసినంత మాత్రాన అబద్ధాలు నిజమైపోవు" అని డిమాండ్ చేశారు

## సంపాదకీయం

# అహం బ్రహ్మాస్మి... రాజకీయం హతోస్మి!

అహం బ్రహ్మాస్మి అంటే నేనే బ్రహ్మ అని చెప్పుకోవడం. అహంతో ఇహం మరచిపోవడం. సర్వం సహా తానే అనుకోవడం. అహంకారం అలంకారంగా మార్చుకోవడం. సాధారణంగా అహం ఎవరికి ఉండదు, ఎవరి స్థాయిని బట్టి అందరికీ ఉంటుంది. దానికే అందంగా ఇంగ్లీష్ లో ఇగో అని పేరు పెట్టుకున్నా అచ్చ తెలుగులో అహం అనుకున్నా తేడా ఏమీ లేదు. అహం వల్ల ఒరిగిందేమిటి అంటే లాభాలు కంటే నష్టాలు ఎక్కువే అని అంటారు. రాజకీయాల్లో అహం పనికి వస్తుందా అంటే దానికి జవాబు అందరికీ తెలిసిందే. లేదు అనే చెబుతారు. నిజానికి ఏ రంగంలో అయినా అహం పనికి రాదు ఆ మాటకు వస్తే దైనందిన జీవితంలో ఎవరికి అయినా అహం అన్నది వారి అభివృద్ధికి అడ్డుకట్టగానే ఉంటుంది. అహం చూపిస్తే చాలానే కోల్పోవాల్సి ఉంటుంది. అయితే తాను స్వయంగా కోల్పోవడం వేరు. బాధ్యత పెంచుకుని పెద్ద హోదాలలో ఉన్నపుడు అహాన్ని చంపుకోకుండా ఉంటే తనతో పాటు నమ్ముకున్న వారు కూడా మొత్తానికి మొత్తం చెడిపోతారు. అందుకే అహం పనికిరాదు అనే అంటారు. కానీ రాజకీయాల్లో ఉన్న వారు అహాన్ని పక్కన పెట్టి ప్రజల కోసం ప్రజల కోణంలో పనిచేయాల్సి ఉంటుంది. కానీ చూడబోతే రాజకీయాల్లో అహాలు భేషజాలు కీలకమైన పాత్రను పోషిస్తున్నాయి. అహంతోనే అన్నీ అనుకుంటున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. రాజకీయాల్లో అహంకారం ఉంటే నమ్ముకున్న వారికి కూడా తీరని అపకారం జరుగుతుంది. ఒక నాయకుడు తీసుకునే నిర్ణయం మూలంగా మొత్తం దెబ్బ తినిపోతారు. రాజకీయాల్లో వ్యూహాలు ఉండాలి. అంతే తప్ప ఎదుటి వారిని ప్రత్యర్థులుగా చూడకుండా శత్రువులుగా భావించడం వల్ల అది ఎక్కడికో పోతుంది అని అంటున్నారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షం ప్రతిపక్షం కలసి పనిచేయాలి. అలా చేస్తేనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యపడుతుంది. ఏపీకి ప్రత్యేక హోదా ఈ రోజుకీ రాకపోవడానికి రాజకీయ పార్టీల మధ్య ఇగోలే కారణం అంటే నమ్మే వారు అధికంగానే ఉంటారని అంటున్నారు. ఏ ఒక్క విషయం మీద కూడా అధికార విపక్షాలు కలసి ఢిల్లీలో కేంద్రం మీద ఒత్తిడి పెట్టిన సందర్భాలు గత పదేళ్లలో లేవనే అంటారు మరో వైపు చూస్తే తమిళనాడులో పాలిటిక్స్ ఇలాగే ఉప్పు నిప్పుగా ఉండేది. కానీ చివరికి చూస్తే వారు ఇపుడు బాగానే ఉన్నారు. ఏపీలో మాత్రం రాజకీయం చాలా గట్టిగా సాగుతోంది. ఆఖరుకు ఒకరు అధికారంలో ఉంటే రెండవ వారు సభకు కూడా వెళ్ళలేని పరిస్థితి గా మారుతోంది. ఏపీలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు జగన్ అసెంబ్లీని బహిష్కరించారు. జగన్ సీఎం గా ఉంటే చంద్రబాబు బహిష్కరించారు. అయితే ఈ ఇద్దరూ తొలి మూడేళ్ళూ సభకు వచ్చారు. ఇపుడు చూస్తే మళ్లీ చంద్రబాబు సీఎం అయ్యారు కానీ జగన్ అసెంబ్లీకి వెళ్లడం లేదు. దానికి కారణం సభలో విపక్షాన్ని టార్గెట్ చేస్తారు అన్నది అని అంటున్నారు. మరి దానిని ఎవరు స్టార్ట్ చేశారు ఎవరు కొనసాగించారు అన్నది చర్చలకు పోనవసరం లేదు. కానీ ఈ తరహా సంప్రదాయం మంచిది కాదు అనే అంటున్నారు. జగన్ సీఎం గా ఉండగా చంద్రబాబు మీద కేసులు పడ్డాయి. ఆయనను ఏకంగా జైలులో పెట్టారు. యాభై రెండు రోజుల పాటు చంద్రబాబు జైలులో ఉన్నారు. ఇక జగన్ ఇపుడు విపక్షంలో ఉన్నారు. మరి కూటమి ప్రభుత్వం వైసీపీ సోషల్ మీడియాను టార్గెట్ చేస్తోంది అని ఫ్యాన్ పార్టీ నేతలు అంటున్నారు. ఇంతకు ఇంత మేము వస్తే చెల్లిస్తామని అంటున్నారు. రెడ్ బుక్ అంటూ టీడీపీ అంటే గుడ్ బుక్ అని వైసీపీ అంటోంది. ఇలా రాజకీయ ప్రత్యర్థులు అన్నది మరచి అధికారంలోకి వస్తే ఎదుటి పార్టీల నేతలను టార్గెట్ చేస్తామని అనుకునే సీన్ దాకా వచ్చేసింది. ఎక్కడా హుందా రాజకీయం కనిపించడం లేదు. ఆఖరుకు ఎట్ హోం పేరుతో రాజ్ భవన్ లో గవర్నర్ ఇచ్చే తేనీటి విందుకు సైతం అధికార విపక్షాలు ముఖాలు చూసుకునేందుకు రావడం లేదు అని అంటున్నారు. తెలంగాణాలో చూస్తే బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు నాడు రేవంత్ రెడ్డి మీద కేసులు పెట్టారు ఆయన జైలుకు వెళ్ళి వచ్చారు. ఆఖరుకు అనుమతి తీసుకుని కుమార్తె పెళ్ళికి హాజరు అయ్యారు అంటే కక్ష పూరిత రాజకీయాలు అని నాడు అన్నారు. ఇపుడు రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. బీఆర్ఎస్ నుంచి కేటీఆర్‌ని అరెస్ట్ చేస్తారు అని అంటున్నారు. అరెస్ట్ చేసుకోనీయండని గులాబీ పార్టీ కూడా సవాల్ చేస్తోంది. తెలంగాణా అసెంబ్లీకి కేసీఆర్ రావడం లేదు. రేవంత్ రెడ్డి సీఎం గా ఉన్నారని ఆయన రావడం లేదని కాంగ్రెస్ అంటోంది. ఈ విధంగా చూస్తూంటే రాజకీయాల్లో పరస్పరం గౌరవించుకోవడం ప్రజా కోణంలో కలసి పనిచేయడం అన్నది మరచిపోతున్నారా అన్న చర్చ వస్తోంది. ఎవరైనా ప్రజా సేవకులే. ప్రజల కోసం పనిచేస్తామని చెప్పి వచ్చిన వారు ఆ ప్రజల కోసం ఆలోచించకుండా అహం బ్రహ్మాస్మి అనుకోవడమేంటి అన్న చర్చ వస్తోంది. అహంకారం తో చేసేది ఏది అయినా పనికి రాదు అన్నది చరిత్ర చెబుతోంది. మరి ఆ సత్యాన్ని ఒంటబట్టించుకుంటారా లేక ఇలాగే ముందుకు సాగుతారా అన్నది చూడాల్సి ఉంది.

# రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణ 70 పీట్లకు కుదించాలి...

## ఎంపీ ఈటలను కలిసిన తూంకుంట ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులు



శామీర్ పేట, (గరుడ వార్త) : రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణలో ప్రభుత్వం చేపట్టనున్న ఎలివేటర్ కారిడార్లో తూంకుంట వద్ద 100 నుంచి 70 పీట్లకు కుదించాలి బాధితులు ఎంపీ ఈటల రాజేందర్ ను కలసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. నగరంలోని జేబీఎస్ నుంచి తూంకుంట పరిధిలోని దొంగల మైసమ్మ వరకు వాహనదారులకు, ప్రయాణికులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా వెళ్ళేలా గత ఆరు నెలల క్రితం ప్రభుత్వం రాష్ట్ర రాజీవ్ రహదారిని ఆరు లైన్లకు విస్తరించాలని జీవో జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర సీఎం రేవంత్రెడ్డి ప్రత్యేక చొరవతీసుకుని జేబీఎస్ నుంచి తూంకుంట మీదుగా దొంగల మైసమ్మ ఓఆర్ఆర్ సమీపం వరకు రాజీవహదారిని ఆరు లైన్లకు విస్తరించి ఎలివేటెడ్ కారిడార్ ను నిర్మింప చేసేందుకు తలపెట్టారు. ఇందులో భాగంగా రోడ్డును ఇరువైపుల రెండు వందల పీట్ల మేరకు స్థలాలను సేకరించాలని, ఆ స్థలాల్లో ఉన్ననిర్మాణాలను తొలగించాలని ప్రభుత్వం సర్వే నిర్వహించి హద్దులు వేసి ప్రకటన సైతం జారీ చేసింది. దీంతో రాజీవహదారి మార్గంలో తూంకుంట వద్ద ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు విస్తరణను ఇరువైపులా 100 పీట్లుకు బదులు 140 పీట్ల మేరకు రోడ్డు ను విస్తరించాలని స్థానిక బాధితులు కోరుతున్నారు. ఈ మేరకు శామీర్ పేట సమీపంలోని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ నివాసంలో తూంకుంట వద్ద రోడ్డు విస్తరణలో ఇళ్ళను, ఇళ్ళ స్థలాలను కొల్పోతున్న బాధితులు కలసి వినతి పత్రాన్ని అందజేశారు. రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణ 100 నుంచి 70 పీట్లకు కుదించి ఇళ్ళు, స్థలాలు కొల్పోకుండా ఆదుకోవాలని బాధితులు ఎంపీ ఈటలకు విన్నవించారు. ఈ విషయం పై ఎంపీ ఈటల స్పం దిస్తు తాను చోరవ తీసుకుని రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రితో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుంకుంట ఇళ్ల స్థలాలు కోల్పోతున్న బాధితులు పాల్గొన్నారు.

# పూర్వ మండల పరిధిలో ఘనంగా స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలు





శామీర్ పేట, (గరుడ వార్త) : భారత తొలి మహిళ ప్రధాన మంత్రి, స్వర్గీయ ఇందిరా గాంధీ107వ జయంతి వేడుకలను పూర్వ శామీర్పేట మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని మీ దగ్గర గ్రామాలలో ఇందిరాగాంధీ విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ లో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో స్వర్గీయ ఇందిరా గాంధీ ఇందిరాగాంధీ విగ్రహానికి డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ భారతదేశంలో పేదరిక నిర్మూలనకు పంచవర్ష ప్రణాళికలు రూపొందించి దేశ ఆర్థిక పరిస్థితి అభివృద్ధి చెందె విధంగా కృషి చేశారన్నారు. 20 సూత్రాల పథకం తో దేశంలో పేదరిక నిర్మూలనకు కృషి చేసిందని తెలిపారు. అలాగే అట్టడుగు వర్గాల ప్రజల సామజిక అభివృద్ధి కోసం బ్యాంకుల ను జాతీయం చేయడం జరిగిందని చెప్పారు. బడుగు బలహీన వర్గాల కోసం భూమి లేని పేద వారి కోసం భూములను పంపిణీ చేసిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. ఉద్యోగాలు లేని వారికి ఉద్యోగా అవకాశాలు, ఇండ్లు లేని వారికి ఇండ్లు నిర్మించి ఇచ్చారని తెలిపారు. అలాగే దేశంలో అనాడు గరిబీ హటావో అనే నినాదం తో దేశమంతా పర్యటించి కొన్ని లక్షల మంది తో కలుసుకుని వారికి అండగా నిలిచారని గుర్తు చేశారు. దేశంలో అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టి దేశాభివృద్ధికి పాటు పడ్డారన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలన అందిస్తున్నారని తెలిపారు. అనంతరం దేవరయంజాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ 4 వ వార్డు కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వలందాస్ మురళి గౌడ్, రామాలయం మాజీ ధర్మకర్తలు ఎల్లేంకి భారతమ్మ, పట్నం నర్సింహా రెడ్డి, నాయకులు చీరాల యాదగిరి, కందాల రాము, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, తిగుళ్ల మురళి గౌడ్, పిన్నింటి ధర్మా రెడ్డి, మహమ్మద్ జాఫర్, భీమిడి కోండల్ రెడ్డి, మోత్కుల మల్లేష్ యాదవ్, గుడిసేని నారాయణ, మెట్టు వెంకట్ రెడ్డి, తీగుళ్ల దర్శన్ గౌడ్, గంధం పాండు గౌడ్, వజ్జల శేశాంత్ (బన్నీ), కార్తీక రెడ్డి, గురిజాల బాబు, మన్నె బిక్షపతి, తలగామ జగన్, గుడిసెని హరికృష్ణ, ఎల్లేంకి గౌతమ్ గౌడ్, సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, గట్టు ప్రదీప్ కుమార్, మిరియాలకార్ సాయి కుమార్, నక్క మల్లేష్ గౌడ్, బాణాల మధుసూదన్ రెడ్డి, కౌకూర్ లక్ష్మణ్, పాండు, కట్ట మధు రెడ్డి, ఏలకుర్తి భాను, మేటే నరేశ్, చింతల మణిదీప్ రెడ్డి, కట్ట శ్రీకాంత్ రెడ్డి, శ్రీకాంత్, వేంకటేశ్, మిరియాలకార్ కిషోర్, పిన్నింటి రోహిత్ రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల హబ్‌గా కొడంగల్



పరిగి : ప్రభుత్వం విద్యా వ్యవస్థకు పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌ను 'గురుకుల హబ్'గా మారుస్తోంది. దీనికోసం మొదటి విడతగా రూ. 73.45 కోట్లను విడుదల చేసింది. మరో రూ. 70 కోట్లు రెండో విడత మంజూరు చేస్తారని అధికారులు పేర్కొంటున్నారు. మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ గ్రామంలో గిరిజన గురుకుల పాఠశాల పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో బీసీ బాలుర జూనియర్ కళాశాల, బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ వద్ద బీసీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల, అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న బీసీ బాలుర గురుకులానికి అదనపు గదులు, మౌలిక సదుపాయాలు ఇలా అన్నింటికి కలిపి ప్రత్యేకంగా ఈ నిధులు వెచ్చిస్తారు. దీంతో దూర ప్రాంతంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలు కొడంగల్‌కు రానున్నాయి.

మౌలిక వసతుల కల్పనకు అవకాశంకొడంగల్ పట్టణ శివారులో 132 సబ్‌స్టేషన్ పక్కనే మహాత్మ జ్యోతిబా ఫులే బాలుర గురుకుల పాఠశాల 15 సంవత్సరాలుగా కొనసాగుతోంది. విద్యార్థులకు సొంత భవనం నిర్మించినా, ఉపాధ్యాయులు ఉండేందుకు వసతులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం గురుకుల పాఠశాలకు రూ. 23.45 కోట్లు విడుదల చేయడంతో మౌలిక వసతులు కల్పించేందుకు వీలు కలుగుతోంది.

మొయినాబాద్‌లో అద్దె భవనంలో కొనసాగింపు

కొడంగల్‌కు బీసీ గురుకుల కళాశాల 5 సంవత్సరాల క్రితం మంజూరు కావడంతో కొంత కాలం పాఠశాల గదుల్లోనే కొడంగల్‌లో నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో మొయినాబాద్‌లోని కనకమామిడి వద్ద అద్దె భవనంలోకి మార్చారు. బాలుర గురుకుల కళాశాలకు రూ. 25 కోట్లు విడుదల కావడంతో పాత కొడంగల్ గ్రామంలో నిర్మాణం పనులు చేపట్టనున్నారు. బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ గ్రామానికి మంజూరైన బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు సొంత భవనం లేదు. దీంతో చేవేళ్ల సమీపంలోని ఊరెళ్లలో అద్దె భవనంలో నిర్వహిసున్నారు. సొంత భవనానికి రూ. 25 కోట్లు విడుదలయ్యాయి. ఎక్కడవి అక్కడే నిర్మాణం అవుతాయిబీసీ బాలికల పాఠశాల, కళాశాలలు రెండు బొంరాస్‌పేట మండలం బూరాన్‌పూర్ వద్దనే నిర్మిస్తారు. అలాగే బీసీ బాలుర గురుకుల పాఠశాల మాత్రం మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ వద్ద నిర్మిస్తారు. ప్రస్తుతం బాలుర ఉన్నత పాఠశాలకు సంబంధించి 132సబ్‌స్టేషన్ పక్కనే ఏర్పాట్లు చేస్తారు. వెంకట్‌రెడ్డి, 'కడా' కార్యాలయం ప్రత్యేక అధికారి, కొడంగల్.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త): శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి





ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద శామీర్ పేటకు చెందిన దేశం వెంకటేష్ గౌడ్– సోని దంపతులు, వారి కుటుంబ సభ్యులు, ఆలయం తరపున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# కాపర్ ల్యాండ్‌లైన్లకు.. కాలం చెల్లినట్లేనా?

హైదరాబాద్:నగరంలో ఇప్పటికీ ల్యాండ్‌లైన్ ఫోన్లను ఇళ్లు, కార్యాలయాల్లో వినియోగిస్తున్నారు. వీటిలో 40వేల దాకా బీఎస్ఎన్ఎల్‌కు చెందిన కాపర్ ఆధారిత కనెక్షన్లు ఉన్నాయి. బ్రాడ్‌బ్యాండ్ సేవలకు కూడా వినియోగిస్తున్నారు. మెరుగైన సేవల కోసం వీటిని ఫైబర్‌లోకి మార్చుకోవాలని వినియోగదారులను బీఎస్ఎన్ఎల్ కోరుతుంది. నిర్వహణ కష్టమని.. : గ్రేటర్‌లో బీఎస్ఎన్ఎల్‌కు విస్తృతమైన ఫైబర్ నెట్‌వర్క్ ఉంది. ఫైబర్ టూ ద హోమ్ పేరుతో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఇస్తోంది. అదే సమయంలో తొలినాళ్లలో వేసిన కాపర్ ఆధారిత నెట్‌వర్క్ కల్గిన కనెక్షన్లు సిటీలో ఉన్నాయి. వీటిలో



నెట్‌వర్క్ లోపాలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. నిర్వహణ కూడా బీఎస్ఎన్ఎల్‌కు సవాల్‌గా మారింది. కాబట్టి కాపర్ నుంచి ఫైబర్‌కు మారాలని వినియోగదారులను అభ్యర్థిస్తుంది.

సానుకూలతల దృష్ట్యా.. కాపర్‌తో పోలిస్తే ఫైబర్‌లో ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అధిక బ్యాండ్‌విడ్త్ కల్గి ఉండటం, సిగ్నల్ లోపాల సమస్యలు తక్కువ. అయితే కాపర్ నుంచి ఫైబర్‌కు మారాలంటే ప్యాకేజీలను ఎంపిక చేసుకోవాలి. కాపర్ నుంచి ఫైబర్‌కు మారేందుకు ఎలాంటి సర్వీస్ ఛార్జీలు ఉండవని బీఎస్ఎన్ఎల్ చెబుతోంది.

4జీ నెట్‌వర్క్ నవీకరణ..

హైదరాబాద్ బిజినెస్ ఏరియా పరిధిలో 1500 ప్రాంతాల్లో టవర్లను 4 జీ నెట్‌వర్క్‌లోకి నవీకరిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి 4జీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని బీఎస్ఎన్ఎల్ ప్రయత్నిస్తోంది. మరిన్ని సేవల ఆధునికీకరణపై దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు.

# చెరువూ చెరువూ ఎక్కడున్నావ్?

హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా గత పదేళ్లలో అనేక నీటి వనరులను ఆక్రమణదారులు మాయం చేశారు. తాజాగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విడుదల చేసిన శాటిలైట్ మ్యాపులతో కూడిన నివేదిక ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఇలానే వదిలిస్తే మరో పదేళ్లలో అవుటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న చెరువులు పూర్తిగా అన్యాక్రాంతం కావడం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు గ్రేటర్‌లో 225 చెరువులు పూర్తిగా అన్యాక్రాంతమయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. మరో 196 పాక్షికంగా ఆక్రమించేశారు. ఇదంతా అవుటర్ రింగ్‌రోడ్డు లోపల జరిగిన ఆక్రమణల తంతు. అవుటర్ అవతల ప్రస్తుతం చెరువుల చుట్టూ అనేక భారీ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఆక్రమించి నిర్మాణాలు కడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా 2014 నాటికి అసలు ఆక్రమణలు లేని చెరువులు సైతం గత పదేళ్లలో ఆక్రమించేశారు. 20 చెరువుల్లో పూర్తిగా, మరో 57 చెరువుల్లో పాక్షికంగా ఆక్రమణలు ఉన్నట్లు తాజాగా శాటిలైట్ మ్యాపులు ద్వారా తెలుస్తోంది. చెరువుల్లోని ఎఫ్‌టీఎల్‌ల్లో కబ్జాలపై హైడ్రా దృష్టి సారించిన సంగతి తెలిసిందే. చాలా చోట్ల కూల్చివేతలు కూడా చేపట్టింది. 2014కు ముందు శాటిలైట్ మ్యాపుల్లో ఆక్రమణలు లేకపోయినా సరే...తర్వాత కాలంలో దారుణంగా ఆక్రమణలకు పాల్పడిన వైనం తేటతెల్లమైంది. దీంతో వేరే దారి లేక వరద నీరంతా సమీపం కాలనీలు, ఇళ్లల్లోకి ముంచెత్తుతోంది. పెద్దపెద్ద నీటి కుంటలను సైతం నామ రూపాలు లేకుండా అన్యాక్రాంతం చేసుకొని పెద్దపెద్ద నిర్మాణాలు చేపట్టారు. కొన్నిచోట్ల చెరువులు ఆక్రమించి లేఅవుట్లు వేసిన వైనం బయట పడింది. 2014 తర్వాత పలు చెరువుల ఆక్రమణల బయట పెట్టాయి.

# ప్రార్థనా మందిరాల భద్రతపై పోలీసుల నజర్

హైదరాబాద్: ప్రార్థనా మందిరాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం ఘటనలు వరుసగా నమోదవుతున్న దృష్ట్యా నగర పోలీసులు దిద్దుబాటు చర్యలకు సిద్ధమవుతున్నారు. ఆలయాలు, చర్చిలు, మసీదులు, ఇతర మందిరాల దగ్గర పటిష్ట భద్రతా చర్యలు తీసుకొనేలా నిర్వాహకుల్ని అప్రమత్తం చేస్తున్నారు. మూడు కమిషనరేట్లలో పోలీస్‌స్టేషన్ల వారీగా చిన్న, పెద్దవి కలిపి ప్రార్థనా మందిరాలు ఎక్కడెక్కడున్నాయి..? నిర్వాహకులు భద్రతాపరంగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..? సీసీ కెమెరాలు వాటి పనితీరు..? ఇలా అన్ని రకాల వివరాలు సేకరిస్తున్నారు. భద్రతాపరమైన లోపాలుంటే గుర్తించి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు చేస్తున్నారు.



**అపరిచితులపై తగ్గిన నిఘా**

ప్రార్థనా మందిరాల దగ్గర అపరిచిత వ్యక్తుల మీద నిఘా తగ్గిపోవడం దాడులకు ఒక కారణమని పోలీసులు ఒక అంచనాకు వచ్చారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన లక్షల మంది నగరానికి ఉపాధికి వస్తున్నారు. వీరిలో కొందరు నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కుతున్నారు. ప్రార్థనా మందిరాల దగ్గర ఆశ్రయం పొందడం, ఫుట్‌పాత్‌లు, బస్టాపులు, నిర్మానుష్య ప్రదేశాల్లో ఉంటూ అదను చూసి పిక్‌పాకెటింగ్, ఫోన్లు, బంగారు ఆభరణాలు కొట్టేస్తున్నారు. మద్యం మత్తు, మానసిక సమస్యలతో ప్రార్థనా మందిరాల దగ్గర అనుచితంగా ప్రవర్తిస్తున్నారు.

# కరగని వ్యర్థాలతో అనర్థాలు

హైదరాబాద్ : మహానగరంలో మురుగునీటి సమస్యలకు ప్రధాన కారణం నీటిలో కరగని వ్యర్థాలు. దీనికి పరిష్కారానికి జలమండలి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. వాణిజ్య భవనాలతోపాటు నివాస సముదాయాలు, బహుళ అంతస్తుల వారు విధిగా సిల్ట్ ఛాంబర్‌లు ఏర్పాటు చేసుకోవాలని ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశించారు. సీవరేజ్ పైపులైన్లు అప్‌గ్రేడ్ చేసుకొని, సిల్ట్ ఛాంబర్‌లు లేని భవనాలు డిసెంబరు నెలాఖరులోపు ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు జారీ చేస్తున్నారు. ప్రధానంగా వాణిజ్య, బహుళ అంతస్తుల సముదాయాల సీవరేజీ పైపులైన్లలోనే అధికంగా మురుగులో కరగని ఆహార పదార్థాలు,



ప్లాస్టిక్ బాటిళ్లు, కొబ్బరి బొండాలు, దుస్తులు, నాప్కిన్స్, డైపర్లు, ఇతర ప్లాస్టిక్ ఉత్పత్తులు మ్యాన్‌హోళ్లలో ఉండటాన్ని జలమండలి గుర్తించింది. ఫీజిబిలిటీ ధ్రువపత్రాల జారీ సులభం: జీహెచ్‌ఎంసీ పరిధిలో కొత్తగా భవనాలు నిర్మించుకునే వారు అనుమతుల కోసం సమర్పించాల్సిన వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రాలను జారీ చేసే ప్రక్రియ సులభతరం చేసినట్లు జలమండలి శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని, ఇది వినియోగదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ధ్రువపత్రాలు జారీ చేస్తుందని తెలిపారు. భవన నిర్మాణ అనుమతికి విధిగా జలమండలి జారీ చేసే వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రం అందించాలి. గతంలో ఈ ధ్రువపత్రం పొందాలంటే జలమండలి సర్కిల్ కార్యాలయాల్లో చీఫ్ జనరల్ మేనేజర్లు జారీ చేసేవారు. ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫీజు చెల్లించిన తర్వాత ఐదు పనిదినాల్లో ధ్రువపత్రాల్ని జారీ చేస్తారు.

# ఈత లేదు... కొలనే ఉంది

హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'ఖేలో ఇండియా' సహకారంతో రూ.5 కోట్లతో నిర్మించిన ఈతకొలను నిరుపయోగంగా మారింది. ప్రత్యేకించి విద్యార్థినుల కోసమే దీన్ని నిర్మించారు. పనులు పూర్తయినా ఎవరినీ అనుమతించడం లేదు.

**ఖేలో ఇండియా' సహకారంతో... :** ఓయూలో రన్నింగ్ ట్రాక్, లాన్‌టెన్నిస్ కోర్టు, ఈతకొలను అవసరమని ఓయూ పరిపాలనా విభాగం అధికారులు ఐదేళ్ల కిందట కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అభ్యర్థించారు. అప్పటి క్రీడా విభాగం సంచాలకులు ప్రొఫెసర్ ఎల్.బి.లక్ష్మి నాయక్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని పలుమార్లు సంప్రదించి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభించగా.. కరోనా ప్రభావంతో తాత్కాలికంగా ఆగిపోయాయి. మళ్లీ ప్రారంభించి ఈ ఏడాది జనవరిలో సింథటిక్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకురాగా... ఈతకొలను నిర్మాణం పూర్తైనా ప్రారంభించలేదు. **అభ్యంతరాలొచ్చినా... :** ఈతకొలను విద్యార్థినుల వసతి గృహంలో కాకుండా ఏంబీఏ కళాశాల, విద్యార్థుల వసతి గృహం మధ్య ఉన్న స్థలంలో ఏర్పాటు చేస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని అధికారులకు చెప్పినా ఖాతరు చేయకుండా పూర్తి చేశారు. పనుల్లో నాణ్యత లేకపోవడం, ఈతకొలను ఇన్‌లెట్, అవుట్‌లెట్ వ్యవస్థ పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో నిర్మాణం పూర్తైనా విద్యార్థులను ఈత కొట్టేందుకు అధికారులు అనుమతించలేదు.

# మురుగు నీరు.. గోదావరి తీరు!



ధర్మపురి : ధర్మపురి క్షేత్రం.. ఇక్కడ గోదావరి నదికి ప్రత్యేక స్థానం ఉంది. దక్షిణముఖంగా ప్రవహించే గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తే ముక్తి పొందుతారని పురాణాలు చెబుతున్నాయి. ఇటువంటి చారిత్రక, పౌరాణిక ప్రాధాన్యం కలిగిన ధర్మపురి గోదావరి దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. గత ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ గోదావరి అంశంపై కొంత కదలిక వచ్చింది. నదిలో మురుగు కలువకుండా చేపట్టిన 'మహా కాలువ' ప్రాజెక్టును పూర్తి చేసి స్వచ్ఛ గోదావరి కలను సాకారం చేయాలని భక్తులు కోరుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

గోదావరి నదిలో ధర్మపురి నుంచి డ్రైనేజీ నీరు కలవకుండా 'మహా కాలువ' నిర్మాణ ప్రాజెక్టును చేపట్టినా అసంపూర్తిగా నిలిచిపోయింది. ఈ కాలువ నిర్మాణం ద్వారా పంచాయతీరాజ్, పురపాలక శాఖల నుంచి ప్రత్యేకంగా రూ.10 కోట్ల నిధులు వెచ్చించి, బ్రాహ్మణ సంఘం నుంచి మహాలక్ష్మిఘాట్ వరకు పెద్ద పైపులను ఏర్పాటు చేసి, నీరు కలువకుండా పనులు చేపట్టారు.

తెనుగువాడ వద్ద మూడు చోట్ల రహదారిని నిర్మించి, డ్రైనేజీలను నిర్మించాల్సి ఉంది. ఈ డ్రైనేజీల నిర్మాణ పనులు గతంలోనే చేపట్టాల్సి ఉన్నా.. ఎన్నికలు రావడం, నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచి పోయాయి. కాలువ నిర్మాణం లేక మురుగు నీరంతా నేరుగా హన్మాండ్ల గడ్డ వద్ద గోదావరిలో కలుస్తోంది.

దిగువన మురుగునీరు శుద్ధీకరణ కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో పరిస్థితికి మొదటికి వచ్చింది. తెనుగువాడ, ఆపై ప్రాంతాల నుంచి వచ్చే నీరంతా ఉసిరికచెట్టు వాగు వద్ద కలువడం, దీనితో ఈ ప్రాంతాల మురుగు నీరంతా తిరిగి, వాగు ద్వారా గోదావరిలో కలుస్తోంది.

దిగువన మహాలక్ష్మి ఘాట్ కింది ప్రాంతంలో మురుగు నీరు గోదావరినదిలో కలిసే చోట్ల శుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి పుర పట్టణాభివృద్ధి సంస్థ నిధులు రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపినా మోక్షం కలగడం లేదు. గోదావరిలో మురుగు నీరు కలవడం దశాబ్దాలుగా జరుగుతోందని.. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా ఫలితం దక్కడం లేదని ధర్మపురి ప్రజలు చెబుతున్నారు.

చేయాల్సింది ఇదే..

ముందుగా తెనుగువాడ, నక్కలపేట ఇందిరమ్మ కాలనీలకు చెందిన మూడు చోట్ల రహదార్లను నిర్మించాలి.

మురుగు నదిలో కలువకుండా తగిన కాలువల నిర్మాణం చేపట్టాలి.

పెద్ద పైపులతో బ్రాహ్మణ సంఘం వద్ద మహా కాలువకు అనుసంధానం చేయాలి. దీంతో మురుగు నీరు వాగులోకి చేరదు.

మహాలక్ష్మిఘాట్ కింద ఎస్టీపీ ప్లాంటు నిర్మాణాన్ని పూర్తి చేయాలి. ఈ నిర్మాణానికి ప్రతిపాదనలు ఇప్పటికే రాష్ట్ర కార్యాలయం వద్ద పెండింగులో ఉన్నాయి. నిధులు విడుదల చేస్తే ధర్మపురి దిగువ ప్రాంతంలోనూ మురుగు కలవకుండా చర్యలు తీసుకున్నట్లవుతుంది.

మరోమారు ప్రతిపాదనలు పంపిస్తాం

ధర్మపురిలో మురుగు నీటి శుద్ధీకరణ ప్లాంటు నిర్మాణానికి మరోమారు ప్రతిపాదనలు పంపిస్తాం. మూడు చోట్ల కాలువ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు మంజూరైతే రహదారి, కాలువ నిర్మాణం చేపట్టొచ్చు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటాం.కందుకూరి శ్రీనివాస్, పుర కమిషనర్, ధర్మపురి

# నిదానంగానే యాసంగి సాగు



జగిత్యాల : అక్టోబరు 1 నుంచి యాసంగి పంటకాలం మొదలైనా ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకూ పైర్లసాగు నెమ్మదిగానే ఉన్నట్లు వ్యవసాయశాఖ తాజా నివేదిక వెల్లడిస్తోంది. సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్న తరుణంలో డిసెంబరు వరకు వచ్చిందంటే అన్నిరకాల పైర్ల విస్తీర్ణం గణనీయంగా పెరగాల్సి ఉండగా ప్రస్తుతం వానాకాలం పంటల నూర్పిడి, విక్రయంలోనే రైతులు తలమునకలై ఉన్నారు.

కరీంనగర్ జిల్లాలో సాధారణంకన్నా 17 శాతం అధికవర్షం కురవగా సగటు భూగర్భ జలమట్టం 4.26 మీటర్ల కనిష్ఠ స్థాయిలో ఉంది. జగిత్యాల జిల్లాలో 20 శాతం అధిక వర్షం కురిసి భూగర్భ జలం 2.88 మీటర్లలో, పెద్దపల్లి జిల్లాలో 11 శాతం అధిక వర్షపాతంతో భూగర్భ జలం 4.15 మీటర్లలో, సిరిసిల్ల జిల్లాలో 29 శాతం అధిక వర్షంతో 5.83 మీటర్ల కనిష్ఠ లోతులో భూగర్భ జలాలున్నాయి. దీనికి తోడు ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీ, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టులు, చెరువులన్నీ నీటితో నిండి ఉండగా యాసంగి ఆయకట్టుకు డిసెంబరు, జనవరి నుంచి ఆన్, ఆఫ్ విధానంలో నీటితడులు ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో వరిసాగు తగ్గించాలంటున్నా సాగునీరు పుష్కలంగా ఉండటంతో ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగిలోనూ వరి ప్రధాన పంటగా ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాలు, వ్యవసాయ యంత్రాలను ఇస్తామన్నా ఇప్పటికీ క్షేత్రచర్యల్లేనందున రైతులు వరివైపే మొగ్గుతున్నారు. మరోవైపు పంటల బీమా అమలు చేస్తామన్నా ఇప్పటికీ నోటిఫికేషన్ వెలువరించక పైర్ల ఎంపికపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు జగిత్యాల జిల్లాలో యాసంగిసాగు 3 శాతం దాటగా కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో ఒకశాతంలోపే ఉంది. మక్క, ఆవాలు, పెసర, మినుము, వేరుసెనగ, జొన్న, సజ్జ, వేరుసెనగ, అలసంద, సెనగ వంటి పంటలను రైతులు విత్తుకోగా డిసెంబరు వరకు మక్క, పొద్దుతిరుగుడు, జనవరిలో నువ్వులు, కూరగాయలు, పెసర, మినుము తదితర పంటల సాగుకు అదనుంది. ఇప్పట్నుంచి డిసెంబరు వరకు రైతులు పెద్దఎత్తున వరినార్లు పోసేందుకు సిద్ధమవుతున్నారు. దొడ్డుగింజ రకాలను అధిక విస్తీర్ణంలో పండించనుండగా వరిలో సంకర, సూటిరకాల్లో విత్తనోత్పత్తి, మరికొందరు సన్నరకాలను పండించనున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబరు నుంచి యాసంగి పైర్లసాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

# ఎరువు.. మరింత 'బరువు'



ఖమ్మం : యాసంగి పంటల సాగు ప్రారంభించగానే కంపెనీలు మూడు రకాల ఎరువుల ధరలు పెంచి అన్నదాతలపై భారం మోపాయి. రైతులు ఎక్కువగా వాడే 20-20-013, 14-35-15, 24-24-0 కాంప్లెక్స్ రకాల ఎరువుల ధరను పెంచాయి. గత వానాకాలం సీజన్‌లో 20-20-013 బస్తా ధర రూ.1,200 ఉండగా ఇప్పుడది రూ.1,300కు చేరింది. 14-35-14 బస్తా ధర రూ.1,700 నుంచి రూ.1,800కు, 24-24-0 బస్తా ధర రూ.1,700 నుంచి 1,800కు పెరిగింది. తద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని రైతులపై అదనంగా రూ.4.50కోట్ల వరకు భారం పడనుంది.

**డాలర్ విలువ పెరగటంతో..**

అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ విలువ పెరిగి రూపాయి విలువ పతనమవటంతో ఆ ప్రభావం ఎరువుల తయారీకి వాడే ఫాస్ఫారిక్ ఆమ్లం, అమ్మోనియా లాంటి ముడిసరకులపై పడింది. అందువల్లే కొన్నిరకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచామని సంబంధిత కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. గత సెప్టెంబర్ వరకు అంతర్జాతీయ విపణిలో టన్ను ఫాస్ఫారిక్ ఆమ్లం 950 డాలర్లు పలకగా ఇప్పుడు సుమారు 1,050 డాలర్లకు చేరింది.

**డీఏపీ ధరల్లో మార్పుల్లేవు**

డీఏపీ ధర పెరిగిందని ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వదంతులు షికారు చేస్తున్నాయి. డీఏపీ బస్తా ధర రూ.1,350కు రైతులకు డీలర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని, దీని ధర పెరగలేదని కంపెనీలు చెబుతున్నాయి. గత అక్టోబర్‌లోనే కేంద్ర ప్రభుత్వం టన్నుకు అదనంగా రూ.175 వరకు రాయితీ పెంచటంతో వచ్చే నెలాఖరు నాటికీ డీఏపీ ధర పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు.

యూరియా, డీఏపీలకు లింకుల చెద

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవటం, సాగునీరు పుష్కలంగా ఉండటంతో రైతులు పెద్దఎత్తున యాసంగి పంటల సాగుకు పూనుకుంటున్నారు. వరి, మొక్కజొన్న పంటల వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. సంబంధిత పంటలకు డీఏపీ, యూరియాలకు డిమాండ్ ఏర్పడింది. ఇదే అదనుగా కొన్ని ఎరువుల కంపెనీలు డీఏపీ, యూరియాకు దుబ్బు గుళికలు, నానో యూరియా, పొటాష్ వంటి పోషకాలను లింకు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నాయని రిటైల్ డీలర్లు ఆరోపిస్తున్నారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడకుండా, లింకులు పెట్టకుండా సరఫరా చేసేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అవసరమయ్యే కాంప్లెక్స్ ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

ఖమ్మం: 30,924

భద్రాద్రి: 30,372


యూరియా, డీఏపీ కావాలని అడిగిన రైతులకు లింకు మందులు అంటగడితే చర్యలు తీసుకుంటాం. యాసంగి సీజన్ ఊపందుకోలేదు. నిర్ణయించిన ధరలకు మాత్రమే రైతులకు ఎరువులు విక్రయించాలి. డి.పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం

# పేరుకే ఉచిత వైద్యం.. సేవలు అంతంతమాత్రం..!

కొత్తగూడెం : పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిన ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు నామమాత్రంగానే లభిస్తున్నాయి. వైద్యులు, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు ఆసుపత్రులను వెంటాడుతున్నాయి. ప్రధానంగా కొత్తగూడెం సర్వజనాసుపత్రిలో అత్యవసర సమయంలో వైద్యమందించలేని పరిస్థితులు దాపురించాయి. నిత్యం 500 మందికిపైగా ఓపీ, 150 మందికి మించి ఇన్‌పేషంట్లకు సేవలందిస్తున్నప్పటికీ అత్యవసర వైద్యం కోసం ప్రైవేట్ దవాఖానాలపై ఆధారపడాల్సి వస్తోంది.

**ఎంసీహెచ్‌ను పట్టించుకుంటేనే..**

గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు మెరుగైన వైద్యమందించాలనే లక్ష్యంతో జిల్లాలో మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆసుపత్రి ప్రారంభించిన కొత్తలో నెలకు 500కుపైగా ప్రసవాలతో గర్భిణులకు సేవలందించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో కొంతకాలంగా వైద్యులు, సిబ్బంది కొరతతో మాసానికి 200-210




కాన్పులు మాత్రమే జరుగుతున్నాయి. ఇక్కడ ఆశించిన స్థాయిలో వైద్యమందకపోవటం వల్ల పాల్వంచ, ఇల్లెందు సీహెచ్‌సీలు, భద్రాచలం ప్రాంతీయాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఎంసీహెచ్‌లో కొన్ని నెలలుగా రేడియాలజిస్ట్ లేకపోవటంతో గర్భిణులకు వైద్యపరీక్షలు కరవయ్యాయి. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు ప్రైవేటులో స్కానింగ్ చేయించుకోవాల్సి వస్తోంది. అందుకే ఆసుపత్రిలో ఓపీ తగ్గిపోయి.. ప్రసవాల సంఖ్య పడిపోతోంది.

**పడిపోయిన పీహెచ్‌సీల ర్యాంకు**

క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు నానాటికీ తీసికట్టుగా తయారవుతున్నాయి. గత ఏప్రిల్, మే మాసాల్లో భద్రాద్రి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండగా.. ప్రస్తుతం 12వ స్థానానికి దిగజారటమే ఇందుకు నిదర్శనం. వైద్య సిబ్బంది కొరత, మౌలిక వసతుల కల్పనలో విఫలమవటం వల్లే పీహెచ్‌సీల ప్రమాణాలు పతనమవుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏఏ విభాగాల్లో పీహెచ్‌సీలు మెరుగైన ఫలితాలు సాధించటం లేదో గుర్తించి వైద్యాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

**సీహెచ్‌సీల్లో మెరుగైన సేవలు**

వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లలో మెరుగైన సేవలందుతున్నాయి. ప్రసవాల విషయంలో ఎంసీహెచ్ కంటే భద్రాచలం ప్రాంతీయాసుపత్రి మెరుగ్గా ఉంది. మణుగూరు, ఇల్లెందు, పాల్వంచ సీహెచ్‌సీల్లో అత్యాధునిక శాస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. చర్ల, మణుగూరు, బూర్గంపాడు సీహెచ్‌సీల్లో గైనకాలజిస్ట్‌ల కొరత వేధిస్తోంది. వైద్యులను నియమిస్తే ఈ మూడుచోట్లా గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందుతాయి.

**అక్టోబర్‌లో జరిగిన ప్రసవాలు**

మాతాశిశు ఆరోగ్య కేంద్రం: 207

భద్రాచలం ఏరియా ఆసుపత్రి: 348

ఇల్లెందు: 46

అశ్వారావుపేట: 26

పాల్వంచ సీహెచ్‌సీ: 95

పీహెచ్‌సీ ర్యాంకుల్లో ఒడిదొడుకులు ఉంటాయి. గతంలో మొదటి స్థానంలో ఉన్నాం. ప్రస్తుతం ఎక్కడైతే విఫలమవుతున్నామో అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేస్తున్నాం. త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటాం. భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ

సర్వజనాసుపత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇటీవల సీనియర్ రెసిడెంట్లు శిక్షణ కాలం పూర్తిచేసుకొని వెళ్లిపోయారు. ఎంసీహెచ్‌కు వచ్చే గర్భిణులను అవసరమనుకుంటేనే ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నాం. వైద్యసిబ్బంది నియామకాలు చేపడుతున్నాం. త్వరలోనేపూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.రాధామోహన్, సూపరింటెండెంట్, సర్వజనాసుపత్రి

# కళ్ల ముందే దర్జాగా కబ్జా!

ఆసిఫాబాద్: సర్కారీ భూములను కళ్ల ముందే కొల్లగొడుతున్నా.. ఏ అధికారికీ కనిపించదు. నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీ భూముల్లో వెంచర్లు వెలుస్తున్నా.. వారికి పట్టదు. కాలువలను పూడ్చి ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నా.. నిలువరించే ప్రయత్నాలు కానరాదు. ఈ తతంగమంతా జిల్లా ఆవిర్భావం నుంచి కొనసాగుతూనే ఉంది. బాండ్ పేపర్ల మీద రాసుకుంటూ ఈ భూములను క్రయ విక్రయా లు జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తున్నా పుర అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్రమ కట్టడాల గురించి తనిఖీల ఊసే లేకపోవడంతో ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆసిఫాబాద్ పట్టణం 2024న ఫిబ్రవరి 1న పురపాలికగా మారింది. ఇటీవలే కొలతలు పూర్తికాగా 20 వార్డులతో ఆసిఫాబాద్ పురపాలిక, షెడ్యూల్ ప్రాంతాన్ని రాజంపేట పంచాయతీగా ఏర్పాటు చేశారు. పుర, పంచాయతీ విస్తరించి ఉన్న ప్రాంతాల్లో డీటీసీపీ (డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) అనుమతులు లేకుండానే వెంచర్లు వేస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని బీడీపీపీ (బిలా దాఖల పోరంబోకు) భూములను సైతం బాండ్ పేపర్ల మీద రాసిస్తూ పలువురికి అంటగడుతున్నారు. పదుల సంఖ్యలో భవనాలు బీడీపీపీ భూముల్లో పూర్తవుతుండగా, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లలో పట్టణ ప్రణాళిక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కాలువ పూడ్చి చదును చేశారిలా.. ఆసిఫాబాద్‌లోని అటవీ చెక్‌పోస్టు ఎదురుగా 215 ఎకరాల బీడీపీపీ ఉంది. సర్వే నంబర్ 39/ఏ, 39/బీ నాలుగు ఎకరాలు రహదారిని ఆనుకుని ఉంటాయి. ఈ భూముల మధ్య నుంచి పెద్దవాగుకు వెళ్లే ఓ కాలువ ఉంది. దీనికి సుమారు 100 అడుగుల మేర అడ్డంగా, మొరంతో పూడ్చి ఆ స్థలాన్ని మొత్తం చదును చేశారు. కాలువ ఒడ్డున ఉన్న ప్రభుత్వ స్థలం చుట్టూ సైతం ప్రహరీ నిర్మించారు. ఈ స్థలం విలువ సుమారు రూ.4 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇవిగో అక్రమాలు..ఆసిఫాబాద్ మండలంలోని గుండి వెళ్లే మార్గంలో ఏజెన్సీ భూముల్లో ఓ వ్యక్తి వెంచర్ వేశాడు. ఇప్పటికే ప్లాట్ల వరకు అమ్ముడు కాగా, ఎలాంటి అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో భవన నిర్మాణాలు ఈ ప్రాంతంలో వెలుస్తున్నాయి. జన్కాపూర్ శివారులో పెట్రోల్‌బంక్ వెనుక ఓ నేత వెంచర్ వేశాడు. డీటీసీపీ అనుమతులు లేకుండానే ప్లాట్లు విక్రయించాడు.

# చేపా.. చేపా.. ఈసారైనా ఎదుగుతావా?

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చేపపిల్లల పంపిణీ పథకం ఎట్టకేలకు మొదలుకానుంది. ఎంపిక చేసిన చెరువుల్లో చేపపిల్లలను ప్రజాప్రతినిధులు, అధికారులు వదలనున్నారు. గతేడాది చేపపిల్లల సరఫరాలో గుత్తేదారులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. చేపపిల్లల సైజు, సంఖ్యలో భారీగా వ్యత్యాసమున్నట్లు ఖమ్మం కలెక్టర్ తనిఖీల్లో బయటపడింది. గుత్తేదారుల నిర్లక్ష్యంతో చేపపిల్లలు ఎదుగుదల లేకపోవటంతో అనేక చెరువుల్లో మత్స్యకారులు వేట నిలిపేశారు. ఈసారైనా అలాంటి పొరపాట్లకు తావులేకుండా చేపపిల్లలను సరఫరా చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

లక్ష్యం ఇలా.. ఖమ్మం జిల్లాలో వాస్తవానికి 3.62 కోట్ల చేపపిల్లలను సరఫరా చేయాల్సి ఉండగా ఈసారి 1.75 కోట్లకు, భద్రాద్రి జిల్లాలో 1.77 కోట్ల చేపపిల్లలకు గాను 88 లక్షలకు లక్ష్యాన్ని కుదించింది. గతంతో పోలిస్తే ఈసారి దాదాపు రెండు నెలల తర్వాత చేపపిల్లల విడుదల కార్యక్రమం చేపడుతుండటంతో లక్ష్యం తగ్గింది. పాత బకాయిల చెల్లింపులేదన్న సాకుతో టెండర్లకు గుత్తేదారులు నిరాసక్తత ప్రదర్శించటం, వర్షాకాలానికి ముందే జరగాల్సిన టెండర్ ప్రక్రియ సెప్టెంబర్‌లో ముగియటంతో ఈసారి చేపపిల్లల విడుదల కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమవుతోంది. ఖమ్మం జిల్లా పరిధిలోని పాలేరు జలాశయంలో చేపపిల్లలను వదిలే కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారు. భద్రాద్రి జిల్లా సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువులో చేపపిల్లలను ప్రజాప్రతినిధులు, అధికారులు వదలనున్నారు.

అవకతవకలకు ఆస్కారం ఉండొద్దు

ఉభయ జిల్లాల్లో గతేడాది చేపపిల్లల సరఫరాలో అవకతవకలు చోటుచేసుకున్నాయి. టెండర్ ప్రకారం కన్నా తక్కువ సైజు చేపపిల్లలు పంపిణీ చేశారని, సంఖ్యలోనూ భారీగా వ్యత్యాసముందని అధికారులు గుర్తించారు. చేపల ఎదుగుదల సరిగ్గా లేక అనేక చెరువుల్లో మత్స్యకారులు వేట నిలిపేశారు. ఈసీజన్‌లో భారీ వర్షాలు కురవటంతో చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే చేపపిల్లల సరఫరా పారదర్శకంగా సాగుతుందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో పాలేరు జలాశయంలో చేపపిల్లలను వదిలే కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారు. ఎంపిక చేసిన చెరువుల్లోనూ క్రమక్రమంగా చేపపిల్లలను వేస్తాం. అవకతవకలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. గుత్తేదారులు నిబంధనల ప్రకారం సైజు, సంఖ్య తగ్గకుండా చేపపిల్లలు సరఫరా చేసేలా పర్యవేక్షిస్తాం. శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

# పేదే పేదే.. అదే మోసం

కొత్తగూడెం : ఆశ ఒక మనిషిని ఎంతదూరమైనా తీసుకెళ్తుందంటారు. అదీ, కుటుంబానికి భద్రత కల్పించే కొలువైతే.. కొందరు నిరుద్యోగ యువత అప్పులు చేసైనా దళారులు అడిగినంత ముట్టజెప్పేందుకు సిద్ధపడుతున్నారు. తప్పని తెలిసినా తప్పదనే భావనతో ఒకరిని చూసి మరొకరు ఇలా ప్రలోభాల వలలో చిక్కుకుంటున్నారు. చివరకు నిట్టనిలువునా మోసపోతున్నారు. ఆర్థికంగా అప్పుల్లో కూరుకుపోయి, గట్టెక్కే దారిలేక తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు. జూలూరుపాడుకు చెందిన రత్నకుమార్, పార్వతి దంపతుల విషాదాంతమే ఇందుకు ఉదాహరణ. ప్రభుత్వ కొలువు దక్కాలనే ఉద్దేశంతో ఓ దళారీని నమ్మి ఏకంగా రూ.16 లక్షలు ముట్టజెప్పారు. స్థానికత, సింగరేణి కారుణ్య నియామకాల ఆశజూపి కాసులు కాజేసిన దళారీ చనిపోవటం, మధ్యవర్తి ముఖం చాటేయటంతో ఏంచేయాలో రత్నకుమార్‌కు పాలుపోలేదు. కొలువు భ్రమలో అప్పులపాలై దంపతులిద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు. దళారులను నమ్మొద్దని సింగరేణి, కేటీపీఎస్ వంటి సంస్థలు, పోలీసులు ఎంతచెప్పినా మారని వారికి ఈ ఘటనే ఓ గుణపాఠం.

ఆశ పుట్టించి.. ఆపై పలాయనం చిత్తగించి..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిశ్రమలకు నెలవు. ముఖ్యంగా సింగరేణి, విద్యుత్తు కేంద్రాలైన కేటీపీఎస్, బీటీపీఎస్‌లో కారుణ్య, ఒప్పంద కొలువుల పేరిట దళారులు నిరుద్యోగ యువతను మోసగించటం



పరిపాటిగా మారింది. అధిక వేతనాలు, అంతకుమించి ఉద్యోగ భద్రత భ్రమలో పడి కొందరు భారీమొత్తంలో డబ్బు ముట్టజెప్పుతున్నారు. అదిగో.. ఇదిగో అని కొంతకాలం తిప్పుకొనే దగాకోరులు చివరకు పలాయనం చిత్తగిస్తున్నారు. గట్టిగా నిలదీస్తే ఎంతోకొంత ముట్టజెప్పి చేతులు దులిపేసుకుంటున్నారు. రత్నకుమార్ దంపతుల బలవన్మరణ ఘటన నేపథ్యంలోనైనా దళారుల్లో ప్రాయశ్చిత్తం కలగాలి. ఇలాంటి వారి ఆటకట్టించేందుకు పోలీసులు, పరిశ్రమల విజిలెన్స్ విభాగాలు నిఘాను పటిష్ఠపరచాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రలోభపెడితే పోలీసులకు ఫిర్యాదు చేయండి

సింగరేణిలో ఉద్యోగాలన్నీ పారదర్శకంగా భర్తీ చేస్తారు. ఎవరైనా దళారులు ప్రలోభపెట్టినా, డబ్బులు వసూలుచేసినా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆ సంస్థ 'పా' విభాగం డైరెక్టర్ ఒకరు తెలిపారు. ఒకవేళ సింగరేణి ఉద్యోగి మోసానికి పాల్పడితే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సింగరేణిలో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలికి మధ్యవర్తుల ద్వారా కొత్తగూడెం రుద్రంపూర్‌కు చెందిన ఓ దళారీ పెద్దఎత్తున డబ్బులు దండుకున్నాడు. మోసపోయామని గుర్తించిన బాధితులు రెండేళ్ల క్రితం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఒప్పంద ఉద్యోగాల పేరిట గతేడాది కొంతమంది దగ్గర ఓ నాయకుడు డబ్బు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

'కారుణ్య' కొలువులు ఇప్పిస్తామని పలువురి వద్ద డబ్బులు వసూలు చేశాడన్న ఆరోపణతో ఓ ఉద్యోగిని ఇటీవల యాజమాన్యం విధుల్లోంచి తొలగించింది. ఉద్యోగాలిప్పిస్తామంటే నమ్మి.. అప్పుచేసి రూ.లక్షలు ముట్టజెప్పిన జూలూరుపాడుకు చెందిన రత్నకుమార్, పార్వతి దంపతులు తాము నిలువునా మోసపోయామని బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన గత సోమవారం చోటుచేసుకుంది.

# ఇక్కడ సమస్యలకే వసతి



హైదరాబాద్ : నగరంలో మూడు నుంచి పదోతరగతి చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలే తిష్ఠ వేశాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 94 వసతి గృహాల్లో 9,116 మంది ఉంటున్నారు. వీటి నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. నీళ్లచారు.. ఉడికీ ఉడకని భోజనమే విద్యార్థులకు దిక్కవుతోంది. అప్పుడప్పుడూ పురుగులు అన్నంలో వస్తున్నాయి.

సంజీవరెడ్డి నగర్, రాయదుర్గం, నార్సింగి, మారేడ్‌పల్లి, సైదాబాద్, చాంద్రాయణగుట్ట, ముషీరాబాద్

సికింద్రాబాద్ మహేంద్ర హిల్స్‌లోని ప్రభుత్వ బాలుర వసతిగృహం... ఇందులో బల్కంపేట, ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉంటున్నారు. ప్రభుత్వ వసతి గృహమైనా అక్కడ మౌలిక సదుపాయాలు సక్రమంగా లేవు. విద్యార్థులకు పుస్తకాలు ఉంచుకునేందుకు, దుస్తులు భద్రపరుచుకునేందుకు సరైన సౌకర్యాలు లేవు. గతంలో కొత్త ట్రంకు పెట్టెలను ఇచ్చినా.. కోర్టులో వివాదం ఉండటంతో వాటిని సీజ్ చేశారు. శౌచాలయాలు శుభ్రంగా లేవు.

ముషీరాబాద్‌లోని జమిస్తాన్‌పూర్‌లో ఎస్సీ బాలికల వసతిగృహం.. ఇక్కడ కూడా పదోతరగతి వరకూ విద్యార్థినులు చదువుకుంటున్నారు. అద్దెభవనంలో కొనసాగుతున్న ఈ వసతి గృహం రోడ్డుకు దిగువన ఉండటంతో వంట చేశాక నీళ్లను డ్రైనేజీలోకి పంపించాలంటే కుదరడం లేదు. రోడ్డుపై మురుగు అప్పుడప్పుడూ వసతి గృహంలోని వంటశాలకు వస్తోంది. విద్యార్థినులుంటున్న ఈ వసతి గృహానికి ప్రహరీ సరిగా లేకపోవడంతో పోకిరీల అల్లరి ఎక్కువగా ఉంటోంది.

ఐటీ కారిడార్‌లోని రాయదుర్గంలోని ఎస్సీ బాలుర వసతిగృహం ఇది. నాలుగు నుంచి పదో తరగతి దాకా విద్యార్థులు ఇక్కడ ఉంటున్నారు.. పది శౌచాలయాలుంటే... వాటికి తలుపులు సరిగ్గా లేవు. విద్యార్థుల గదులూ సక్రమంగా లేవు. వర్షం కురిస్తే పైకప్పుల్లోంచి నీళ్లు వస్తాయి. చలికాలంలో కిటికీల్లోంచి వచ్చే చల్లగాలి తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. ఇన్ని అసౌకర్యాలున్నా సరే... విద్యార్థులు సర్దుకుంటున్నారు. పాఠశాలకు వెళ్లి వస్తున్నారు.

**ఇబ్బందులు అనేకం**

ప్రభుత్వం అల్పాదాయ వర్గాలు, పేద విద్యార్థులకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రభుత్వ వసతి గృహాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఐదు కి.మీటర్లకుపైగా దూరం ఉన్న పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు బీసీ,ఎస్టీ విద్యార్థులకు హస్టళ్లలో వసతి కల్పిస్తున్నారు.

వీరికి ఒక ట్రంకుపెట్టె, ఏడాదికి నాలుగు జతల దుస్తులు, రెండు దుప్పట్లను ఇవ్వాలి. వీటిని కొన్నేళ్లుగా సక్రమంగా ఇవ్వడం లేదు. వసతి గృహాల నిర్వహణ, ఖర్చులకు బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల నుంచి గతంలో బడ్జెట్ కేటాయింపులు సక్రమంగా లేవు.

ఈ ఏడాది కూడా వసతి గృహాలకు అద్దె బకాయిలను ఇవ్వలేదు.

**26 ఏళ్లుగా...**ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేవు. సనత్‌నగర్‌లోని బాలికల వసతిగృహంలో ఒక గదిలో ఏడుగురు ఉంటున్నారు. వీరికి ట్రంకు పెట్టెలు, పుస్తకాలకు అల్మారాలు లేవు. 26 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే వసతిగృహం కొనసాగుతోంది. వర్షం కురిస్తే నీళ్లన్నీ గదుల్లోకి వస్తున్నాయి.తరలింపు పట్టించుకోరేం..: నార్సింగిలోని ప్రభుత్వ బాలికల వసతి గృహం ప్రమాదకరంగా ఉందని పదేళ్ల క్రితమే అధికారులు చెప్పినా... మరోచోటికి తరలించకుండా అక్కడే కొనసాగిస్తున్నారు. అధికారులేం చేస్తున్నట్టో..: వసతి గృహాల్లో తగినన్ని మరుగుదొడ్లు, స్నానాల గదులు లేవు. పది మందికి ఒక మరుగుదొడ్డి, స్నానాల గది ఉన్నాయి. పాఠశాలకు వెళ్లే సమయానికి కాలకృత్యాలు తీర్చుకోవడం సమస్యగా మారుతోంది. కొన్ని సార్లు స్నానాలు చేయకుండానే వెళ్తున్నారు. దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు.

# చిన్నబోతున్న అమ్మతనం!.. సరోగసీలో నిబంధనలకు తిలోదకాలు



హైదరాబాద్: కర్ణాటక నుంచి ఉపాధి కోసం నగరానికి వచ్చిన ఆలుమగలు.. ఇద్దరు పిల్లలతో చాలీచాలని సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. గతేడాది ఆమె భర్తకు దళారీ పరిచయమయ్యాడు. పిల్లాడిని కనేందుకు అంగీకరిస్తే రూ.4లక్షలిస్తానంటూ నమ్మించాడు. సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. వైద్యపరీక్షల అనంతరం అడ్వాన్స్‌గా ఆ దంపతులకు రూ.20వేలు ఇచ్చారు. ఆసుపత్రిలో ఇచ్చిన చికిత్సతో ఆమె అనారోగ్యం బారిన పడటంతో గొడవ మొదలైంది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవడంతో రంగంలోకి దిగిన ఆసుపత్రి నిర్వాహకులు వారికి రూ.2లక్షలిచ్చి సొంతూరు పంపినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో హబ్సిగూడ పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రి ఇదే తరహాలో ఒక మహిళను సరోగసీ ప్రక్రియకు వినియోగించుకోవడంతో ఆమె తీవ్ర అనారోగ్యానికి గురైంది. జూబ్లీహిల్స్ కేబీఆర్ పార్కు సమీపంలో భవనాన్ని అద్దెకు తీసుకొని 20 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తూ ముఠా పట్టుబడింది. తాజాగా నగరంలోని మాదాపూర్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, సోమాజీగూడ, బంజారాహిల్స్‌లోని కొన్ని ఆసుపత్రుల్లో ఈ దందా నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని ఓ పోలీసు అధికారి తెలిపారు.

నిబంధనలివీ.. దంపతులకు పెళ్లయి ఐదేళ్లు నిండాలి. పిల్లలు, దత్తత తీసుకున్న సంతానం ఉండరాదు. భర్తకు 26–55, భార్య వయసు 25–50 ఏళ్ల మధ్య ఉండాలి. వారిలో ఒకరికి ఇన్‌ఫెర్టిలిటీ సమస్య ఉన్నట్టు జిల్లా మెడికల్ బోర్డు ధ్రువపత్రం, జన్మించిన బిడ్డ సంరక్షణ హక్కులకు మెజిస్ట్రేట్ అనుమతి, సరోగసీ తల్లికి ప్రసవానంతరం 16 నెలల బీమా సౌకర్యం కల్పించాలి. ఒక బిడ్డకు జన్మనిచ్చి ఉండాలి. ఒకసారి మాత్రమే అద్దెగర్భం సమీప బంధువులకు మాత్రమే ఇవ్వాలి. ఇప్పుడేం చేస్తున్నారంటే సంతానలేమి, నవమాసాలు మోయడం, ప్రసవ నొప్పులు భరించలేని ఎన్నో జంటలు అద్దెగర్భం వైపు మొగ్గుచూపుతున్నాయి. ఆ సమయంలో గర్భాన్ని అద్దెకిచ్చిన తల్లులు, పుట్టిన బిడ్డలకు ఆరోగ్య సమస్యలు, న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తినప్పుడు వారిని ఎవరు సంరక్షించాలనే సమస్య తలెత్తింది. దీంతో 2022లో సరోగసీ ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చారు. అద్దెగర్భం ద్వారా సంతానం పొందేవారికి నిబంధనలు విధించారు. చట్టప్రకారం నడుచుకుంటే ఆలస్యమవటం, అనుమతులు రావనే ఉద్దేశంతో అధికశాతం అడ్డదారులు వెతుక్కుంటు న్నారు. సంతానం లేని దంపతుల బలహీనతను ఆసరా చేసుకొన్ని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు గుట్టుగా సరోగసీ ప్రక్రియను కొనసాగిస్తున్నాయి. యువతులు, ఒంటరి మహిళలు, పేద గృహిణులకు డబ్బు ఎరవేస్తున్నాయి. దళారులను రంగంలోకి దింపి అద్దెగర్భానికి రూ.లక్షలు ఇస్తామని బేరసారాలు సాగిస్తున్నారు. మహిళలు, ఆసుపత్రుల నిర్వాహకులకు విభేధాలొచ్చినా.. ఇతర కారణాలతో సరోగసీ బిడ్డ వద్దని అవతలి వైపు నుంచి ఒత్తిడి వచ్చినా సదరు మహిళలు మనోవేదన అనుభవిస్తున్నారు.

# కలల కొలువుకు.. కసితీరా చదివేస్తూ!

కొత్తగూడెం : ప్రజల రక్షణే విధిగా పనిచేసే పోలీసుల సేవలు మరువలేం.. సమాజ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించే పోలీసులు ఇతర ఉద్యోగాలనూ సాధించి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్–4 ఫలితాల్లో ఉత్తీర్ణులైనవారు ఎక్కువ శాతం పోలీసు కానిస్టేబుళ్లే కావటం గమనార్హం.ప్రభుత్వ ఉద్యోగం సాధించటం నిరుద్యోగుల కల. ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ ఉద్యోగం వస్తే చాలు.. ఇక జీవితంలో స్థిరపడిపోవచ్చు అనుకునేవారు చాలామందే ఉంటారు. మనసుకు నచ్చినా.. నచ్చకపోయినా.. చేస్తుంది సర్కారు కొలువే కదా అని వచ్చిన ఉద్యోగంలోనే ఏళ్ల తరబడి కొనసాగుతున్నవారూ ఉన్నారు. అయితే నేటి యువత ఇందుకు భిన్నంగా ఆలోచిస్తోంది. ఒకటి.. రెండు.. మూడు ఇలా వచ్చినవన్నీ ప్రభుత్వ ఉద్యోగాలే అయినా కలల కొలువు సాధించే వరకు ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు ఇటీవల వెల్లడైన డీఎస్సీ, జేఎల్, గ్రూప్–4 వంటి పోటీ పరీక్షల ఫలితాల్లోనూ సత్తా చాటడం విశేషం.

గ్రూప్–4 ఫలితాల్లో ముదిగొండ మండలానికి చెందిన నలుగురు ఉద్యోగం సాధించగా.. అందులో ముగ్గురు ఇప్పటికే కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. తల్లాడ నుంచి ముగ్గురు ఉద్యోగానికి ఎంపికవగా.. వీరిలో ఇద్దరు కానిస్టేబుళ్లే. వైరా నుంచి ముగ్గురు ఉద్యోగం సాధించగా.. వీరిలో ఒకరు కానిస్టేబుల్. టేకులపల్లి మండలంలో నలుగురు ఉద్యోగానికి ఎంపికయ్యారు. అందులో ఒకరు ప్రస్తుతం కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పోలీసు కొలువులు చేస్తూ ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో సత్తాచాటిన వారు పదుల సంఖ్యలో ఉండటం విశేషం.

గతంలో గ్రూప్–4 ఉద్యోగం.. గురుకుల డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు, ఇటీవల విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 16వ ర్యాంకు.. ఇది మధిర పట్టణానికి చెందిన కుమ్మర పంకజ్ సాధించిన ఉద్యోగాల జాబితా.. ప్రస్తుతం జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా కొనసాగుతున్న పంకజ్.. భవిష్యత్తులో తన కలల కొలువు 'సివిల్ సర్వీసెస్' లక్ష్యంగా కసరత్తును ముమ్మరం చేస్తానంటున్నారు.

డిగ్రీ పూర్తయిన తర్వాత ఆర్మీలో ఉద్యోగం.. 17ఏళ్ల పాటు దేశసేవలో నిమగ్నమై 2022లో ఉద్యోగ విరమణ పొందారు ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన బెందు వీరబాబు. ఇక్కడితో ఆగిపోకుండా మళ్లీ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. గతేడాది కానిస్టేబుల్ పరీక్షల్లో ఎక్స్ సర్వీస్‌మెన్ కేటగిరీలో టాపర్‌గా నిలిచారు. ఓవైపు ఉద్యోగం చేస్తూనే గ్రూప్–4 పరీక్షలో 142 మార్కులు సాధించి వార్డు అధికారిగా ఎంపికయ్యారు. భవిష్యత్తులో గ్రూప్–1 కొలువు సాధించటమే లక్ష్యమని ఆయన చెబుతున్నారు.

ఉన్నత స్థాయికి చేరటమే లక్ష్యం..'యాక్టర్ కాబోయి డాక్టర్‌నయ్యాను' అనేది ఒకప్పటి మాట.. నేటి యువత మాత్రం అనుకున్న స్థాయికి చేరటమే లక్ష్యంగా తమ విజ్ఞానానికి పదునుపెడుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా, ఒక్కో మెట్టు ఎక్కుతూ కలల చేసుకుంటున్నారు.

# నాటు వేసేందుకే మొగ్గు

ఆత్మకూర్: నెమ్మికల్‌లో నాటు వేసిన పొలం : జిల్లాలో ప్రధాన పంటగా వరిసాగు చేపడుతున్నారు. ఏటా పెట్టుబడులు పెరుగుతున్నా.. వరి వైపే అన్నదాతలు దృష్టి సారిస్తున్నారు. వివిధ పద్ధతుల ద్వారా సాగుకు పెట్టుబడులు తగ్గించే అవకాశం ఉన్నా.. రైతులు ఆ దిశగా మొగ్గు చూపడం లేదు. ప్రధానంగా నాట్లు వేసే సమయంలో కూలీల కొరత అధికంగా ఉండటంతోపాటు ఎకరాకు రూ.5 వేల వరకు కూలీలకే వెచ్చించాల్సిన పరిస్థితి. కూలీల సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా డ్రమ్ సీడర్, వెదజల్లు పద్ధతిని ఉపయోగించే అవకాశం ఉన్నా రైతులు ఆ దిశగా యోచన చేయడం లేదు. ఈ పద్ధతిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉన్నా.. పని ఒత్తిడి కారణంగా పట్టించుకోవడం లేదు. పంట దిగుబడి రాదేమోనని, చీడపీడల బెడద అధికంగా ఉంటుందని, అధిక పెట్టుబడికి వెనకాడకుండా నాటు వేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. వెదజల్లు, డ్రమ్ సీడర్ పద్ధతులపై అన్నదాతలు మొగ్గు



చూపితే చాలా వరకు పెట్టుబడి తగ్గే అవకాశం ఉండటంతోపాటు దిగుబడి కూడా పెరుగుతోంది. ఈ విషయమై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

లక్షన్నర ఎకరాల్లోపే..జిల్లాలో ఈ వానాకాలం ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతాల్లో 4,46,652 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. కాగా డ్రమ్ సీడర్, వెదజల్లు పద్ధతి ద్వారా కేవలం లక్షన్నర లోపే ఎకరాల్లో మాత్రమే చేపట్టడం గమనార్హం. సంప్రదాయ పద్ధతిలో నాటు వేయడంతో ఎకరాకు రూ.6 వేల వరకు ఖర్చు అవుతోంది. డీజిల్, ఎరువుల ధరలు పెరగడంతో అదనంగా మరో రూ.3 వేల భారం పడుతోంది. మొత్తమ్మీద ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దిగుబడి ఆశాజనకంగా ఉంటే రూ.40 వేల వరకు రాబడి వస్తోంది. చీడ పీడలు, వర్ష ప్రభావం ఎక్కువ ఉన్నా.. తక్కువ ఉన్నా దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో పెట్టుబడులు అధికమయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే వెదజల్లు, డ్రమ్ సీడర్ విధానాన్ని అవలంబిస్తే రైతులకు చాలా వరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది.

దృష్టి సారించాలి

శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

వెదజల్లు, డ్రమ్ సీడర్ విధానంపై రైతులు దృష్టి సారించాలి. పంటకు పెట్టుబడి చాలా వరకు తగ్గుతోంది. దిగుబడిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రుణమాఫీ, పంట లెక్క వేసే మండల అధికారులు నిమగ్నం కావడంతో అవగాహన కల్పించే సమయం లేదు. యాసంగిలో ఈ విధానంపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తాం.

వెదజల్లు విధానంతో ప్రయోజనాలు:

నాటు విధానం ద్వారా ఎకరాకు 25 కిలోల వరకు విత్తనాలు అవసరం. వెదజల్లు పద్ధతిలో 12 నుంచి 15 కిలోలు సరిపోతాయి.

నాటు వేసేందుకు కూలీలకు ఎకరాకు రూ.5వేల వరకు ఖర్చు అవుతోంది. డ్రమ్ సీడర్, వెదజల్లు ద్వారా అయితే కేవలం రూ.500 మాత్రమే అవుతాయి.

నారు పెంచి తిరగ నాటడం వల్ల వేర్లు తెగడంతో పిలకలు తక్కువగా వస్తాయి. వెదజల్లే పద్ధతిలో నేరుగా పెరగడం వల్ల దుబ్బులు, కంకులు ఎక్కువ వస్తాయి. దిగుబడులు పెరుగుతాయి.

వెదజల్లే పద్ధతి అవలంబిస్తే పంట ఆరంభంలో మందులతో కలుపు నివారించొచ్చు. పంట త్వరగా కోతకు వస్తుంది.

# గ్రామాల్లో అమృత్ ఫలాలు..!

రాజపేట : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించి, భూగర్భ జలాలు పెంపొందించేందుకు మిషన్ అమృత సరోవర్ పథకం కింద చేపట్టిన చెరువుల పూడికతీత పనులు సత్ఫలితాలిస్తున్నాయి. ఈ పథకం కింద జిల్లాలోని 14 మండలాల్లో 76 చెరువులను ఎంపిక చేశారు. ఇందులో 42 చెరువుల్లో పూడికతీత పనులు పూర్తి చేయగా, మిగిలిన 34 చెరువుల పనులు పురోగతిలో ఉన్నాయి. జిల్లాలో పథకం తీరుతెన్నుల విషయమై వివరాలు క్లుప్తంగా..

పద్నాలుగు మండలాల పరిధిలో..

పథకంలో భాగంగా కొత్తగా నీటి కుంటలను తవ్వి నీటి వనరులను నిల్వ చేయాల్సి ఉంది. కుంటల నిర్మాణానికి స్థలాలు అనువుగా లేకుంటే, ఇప్పటికే ఉన్న కుంటలను, చెరువుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పథకంలో వీలు కల్పించారు. ఆ దిశగా అధికారులు కసరత్తు చేసి జిల్లాలోని 14 మండలాల్లో 76 చోట్ల నీటికుంటలు,



చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఉపాధిహామీ, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులను చేపట్టాలని కేంద్రం స్పష్టం చేసింది. ఆ దిశగానే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కేంద్రం రూపొందించిన నిబంధనల ప్రకారం చెరువులను ఎంపిక చేసి పనులను చేపట్టారు. ఈ పథకం పనుల వల్ల ఉపాధి కూలీలకు అదనంగా పని దొరికే అవకాశం ఏర్పడింది.

జలమట్టం పెంపునకు దోహదం: నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, యాదాద్రి

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని మిషన్ అమృత్ సరోవర్ పథకం కింద జిల్లాలో మొత్తం 76 పనులను ఎంపిక చేశాం. అందులో సగానికిపైగా పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు పురోగతిలో ఉన్నాయి. ముఖ్యంగా ఈ పథకం కింద చేపట్టే చెరువుల పూడికతీత పనులతో కూలీలకు ఉపాధి లభించడంతోపాటు భూగర్భ జలమట్టం పెంపునకు అవకాశం ఏర్పడుతుంది.

# మొక్కే కదా అని వదిలేస్తే..

హైదరాబాద్ : మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌కు చెందిన 19 ఏళ్ల యువకుడు స్థానిక రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గట్టిగా ప్రశ్నించగా.. రైల్వే ట్రాక్ పక్కన గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు అంగీకరించాడు. బిహార్‌కు చెందిన యువకుడు ధూలపల్లిలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. అతని నివాసం వద్ద కొత్తరకం మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం అందుకుని మేడ్చల్ అబ్కారీ పోలీసులు దాడి చేయగా గంజాయి అని తేలింది.

నగరంలో గంజాయి మొక్కల పెంపకం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల నుంచి ఓవైపు పెద్దఎత్తున గంజాయి సరఫరా అవుతుండగా.. కొందరు కేటుగాళ్లు ఇక్కడే సొంతంగా మొక్కలు పెంచడం పోలీసులు, అబ్కారీ శాఖకు సవాల్‌గా మారింది.



గంజాయి స్మగ్లింగ్, విక్రయాలపై నిఘా పెరగడం, పట్టుబడితే కటకటాలు తప్పవన్న కారణంతో కొందరు ఇంటి ఆవరణలో, నగర శివార్లలో మొక్కలు పెంచుతున్నారు. అబ్కారీ శాఖ ఈ ఏడాది సెప్టెంబరు వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో 663 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుంది. సెప్టెంబరులోనే 203 మొక్కలను పట్టుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అయ్యే గంజాయిలో దాదాపు 40 శాతం ధూల్‌పేట నుంచే వెళ్తోంది.

ఏవోబీలో కిలో రూ.3 వేలుగా ఉన్న గంజాయి ధర నగరానికి సరఫరా అయిన తరువాత రూ.30 వేలకు చేరుతోంది.

# పని చేయని బోరుకు ప్రాణం

హైదరాబాద్ : చాలా కాలంగా చుక్క నీరు రాకుండా.. మూలకు చేరిన జలమండలి బోర్లు తిరిగి ప్రాణం పోసుకోనున్నాయి. గ్రేటర్ వ్యాప్తంగా ఈ వినూత్న ప్రక్రియకు జలమండలి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి చేసింది. లేదంటే వచ్చే వేసవి నుంచి అలాంటి ఇళ్లకు నీటి ట్యాంకర్లను మూడు రెట్ల ధరకు విక్రయించనున్నారు. ఇందులో భాగంగా పనిచేయకుండా ఉన్న బోర్ల వద్ద ఇంజక్షన్ వెల్‌లను ఏర్పాటు చేసి తిరిగి వాటిని పనిచేసేలా చేయనున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా జలమండలి చెందిన 3,222 వరకు పవర్ బోర్లు, చేతి పంపులు ఉన్నాయి. భూగర్భ జలాలు



అడుగంటిపోవడంతో కొన్ని పనిచేయడం లేదు. ఎండిపోయిన బోరుకు సమాంతరంగా ఇంజక్షన్ వెల్ ఏర్పాటు చేయనున్నారు. వర్షపు నీరు ఆ ఇంజక్షన్ వెల్‌లోకి పంపనున్నారు. ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి తిరిగి బోర్లు పనిచేయనున్నాయి. దీనివల్ల మరోసారి బోరు ఎండిపోయే పరిస్థితి ఉండదు.

నగరంలో జలమండలికి చెందిన బోర్ వెల్స్ ఇలా..

మొత్తం పవర్ బోర్లు 2,796 పని చేయనివి 942 కూలినవి 84మొత్తం చేతి పంపులు 3070 పనిచేయనవి 1717 కూలిపోయినవి 339

# పౌర సేవల్లో జాప్యమేల?

పెద్దపల్లి : పురపాలికల్లో వివిధ పౌరసేవలను నిర్ణీత గడువులోగా అందించాల్సి ఉంటుంది కానీ.. గత నెలరోజులుగా జిల్లాలోని వివిధ పురపాలికలు ఇన్‌ఛార్జి అధికారులు ఏలుబడిలో ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ కారణాలతో వెళ్లిపోయినా.. అధికారుల స్థానంలో కొత్తవారి నియామకం జరగకపోవడంతో ఇన్‌ఛార్జిలే పరిపాలన సాగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి రామగుండం నగరపాలిక కమిషనర్‌గా జిల్లా అదనపు పాలనాధికారి అరుణశ్రీ, మంథని కమిషనర్‌గా పురపాలిక సూపరింటెండెంట్ మనోహర్, సుల్తానాబాద్ పురపాలిక ఇన్‌ఛార్జి కమిషనర్‌గా పెద్దపల్లి కమిషనర్ వెంకటేశ్ వ్యవహరిస్తున్నారు. వారం క్రితం ఇన్‌ఛార్జి అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో అత్యవసర సేవలు అందుబాటులోకి వచ్చాయి కానీ.. పౌరసేవలు మాత్రం పూర్తిస్థాయిలో అందడం లేదు.

పెద్దపల్లి పురపాలికలో వివిధ అంశాలపై నిత్యం 40 నుంచి 50 దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు.

జనన, మరణ ధ్రువీకరణలతోపాటు పేరు మార్పిడి, ఇంటి అనుమతులు తదితర సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయి.




సుల్తానాబాద్ పురపాలిక కమిషనర్ రెండు నెలలుగా లేకపోవడంతో కార్మికులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

వారం క్రితం పెద్దపల్లి కమిషనర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో కార్మికులకు వేతనాలు చెల్లించడంతోపాటు అత్యవసర సేవలు అందుబాటులోకి వచ్చాయి. రెండు నెలలుగా జనన, మరణ ధ్రువీకరణల కోసం 87 దరఖాస్తులు రాగా వాటిలో నిర్ణీత గడువు దాటిన తరువాత కూడా 25 దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేదు.

మంథని పురపాలిక కమిషనర్ గత నెలలో సరెండర్ కావడంతో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా మున్సిపల్ సూపరింటెండెంట్ వ్యవహరిస్తున్నారు. ఆయనకు వారం క్రితం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో పౌరసేవల్లో కొంత వేగం పుంజుకుంది. జనన, మరణ ధ్రువీకరణలతోపాటు ఇంటి పన్ను సంబంధిత సమస్యలపై 106 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దసరా తరువాత దరఖాస్తుల పరిష్కారం పూర్తి చేస్తామని కమిషనర్ మనోహర్ తెలిపారు.

# నీరు దిగలే.. భవిష్యత్తు దిగులే



హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా భూగర్భ జలాల నిల్వలు ఆందోళనకరంగా పడిపోతున్నాయి. ఏయేటికాయేడు కీలక ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాల్లో తగ్గుదల కనిపిస్తోంది. తాజాగా భూగర్భ జలవరుల విభాగం విడుదల చేసిన నివేదిక ప్రకారం...అనేక ప్రాంతాల్లో మీటర్ నుంచి 14 మీటర్ల వరకు తగ్గుదల కన్పిస్తోంది. ప్రధాన నగరం కంటే శివార్లలో తగ్గుదల ఆందోళనకరంగా మారింది. మహానగరం వేగంగా విస్తరించడంతోపాటు భారీ భవనాల నిర్మాణాలు...చెరువుల ఆక్రమణలు...మరోవైపు వాన నీటి సంరరక్షణలో నిర్లక్ష్యం వల్ల ఆ ప్రభావం భూగర్భ జలమట్టాలపై పడుతోంది. కూకట్‌పల్లిలో గతేడాడితో పోల్చితే ఏకంగా 13.72 మీటర్లు కిందికి పడిపోయాయి. ఇబ్రహీంపట్నంలో 14.83 మీటర్లు భూగర్భ జలమట్టాలు తగ్గాయి. అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతంలో 12.82 మీటర్లు తగ్గుదల కన్పిస్తోంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో భూగర్భ జల విభాగం ఫిజోమీటర్లు ఏర్పాటు చేస్తుంది. అక్కడ నమోదైన వర్షపాతం ఆధారంగా ఈ నీటి నిల్వలు లెక్క కడుతుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరిలోని 30మండలాల్లో సెప్టెంబరు నెలలో సాధారణ వర్షపాతం కంటే తక్కువే నమోదైంది. సరాసరి 30శాతం వరకు తగ్గుదల కన్పించింది.

వాన నీటి సంరక్షణతోనే..


హెచ్‌ఎండీఏ ఏరియా...సాధారణ వర్షపాతం లెక్కలోకి తీసుకుంటే ఏటా ఇక్కడ కురిసే వర్షం 15 టీఎంసీలకు సరిసమానం అని నిపుణులు అంచనా. ఇందులో 5శాతం కూడా భూమిలోకి ఇంకించలేని పరిస్థితి.

గతంలో చాలా అపార్ట్‌మెంట్లు, 300 చదరపు మీటర్లు దాటిన వ్యక్తిగత గృహాల్లో ఇంకుడు గుంతలు నిర్మించినప్పటికీ నిర్వహణ లేక పూడుకుపోయాయి. కాలనీలు, పార్కుల్లో ఇంకుడుగుంతలదీ అదే దారి. దీంతో వర్షపు నీరు ఇంకడం లేదు.

శివార్లలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరుగుతోంది. భారీ బోర్లు వేసి అక్కడ భూగర్భ జలాలను తోడేస్తున్నారు. అదే స్థాయిలో వాన నీళ్లు భూమిలోకి చేరక భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గతంలో జలమండలి, జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో భారీఎత్తున ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. మరోసారి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి. జలమండలి ఆ దిశగా దృష్టి సారించింది.

సిమెంట్ రహదారులు.. ఎక్కడికక్కడ భారీ నిర్మాణాల వల్ల భూమి లోపలకు నీళ్లు ఇంకడం లేదు. వాన నీరంతా మురుగు కాల్వల ద్వారా మూసీలోకి చేరుతోంది.

# విదేశాలకు స్వదేశీ రుచులు!



కరీంనగర్: విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం నిమిత్తం ఏటా ఉమ్మడి జిల్లా నుంచి విదేశాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇప్పటికే అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లాంటి దేశాల్లో స్థిరపడిన ఇక్కడి కుటుంబాలు చాలానే ఉన్నాయి. ఈక్రమంలో ఇక్కడి తినుబండారాలు, పచ్చళ్లకు విదేశాల్లో గిరాకీ ఏర్పడింది. అక్కడి ఆహార పదార్థాలు నచ్చక, చేసుకోవడానికి సమయం లేక, ఆరోగ్యం తదితర కారణాలతో ఇక్కడి నుంచి బట్వాడా చేసుకొంటున్నారు. మందులు, వంట సామగ్రి, పప్పులనూ ఇక్కడి నుంచి ఇతర దేశాలకు పంపిస్తుండటంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో కొరియర్ సంస్థలు పెరిగాయి.

తినుబండారాలే అధికం..

అమెరికా, ఇంగ్లాండ్‌లాంటి దేశాల్లో భార్యాభర్తలు ఉద్యోగం చేస్తేనే కుటుంబ పోషణతోపాటు డబ్బు పొదుపు చేసుకోవడానికి వీలుంటుంది. విధులు నిర్వర్తించడం, ఖాళీ సమయం ఎక్కువ ఉండకపోవడంతో, ఆరోగ్యం, రుచులపరంగా ఇంటి నుంచి తెప్పించుకోవడానికి ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సాయంతో లేదా కొరియర్ ద్వారా తెప్పించుకుంటున్నారు. దీనికి అనుగుణంగా కొరియర్ సంస్థలు ఫెడెక్స్, యూపీఎస్, డీహెచ్ఎల్, ఇతర సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొని పార్సిళ్లను పంపిస్తున్నాయి. ఎక్కువగా పచ్చళ్లు, మిఠాయిలు, పిండి పదార్థాలు, మందులు(మెడిసిన్స్) విదేశాలకు కొరియర్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.కోట్లలో వ్యాపారం

కిలో పార్సిల్‌కు రూ.2800, 10 కిలోల పైన ఉంటే కిలోకు రూ.660–700 చొప్పున, మందులకు అయితే రూ.3400(500 గ్రాములు) తీసుకుంటున్నారు. విదేశాలకు కొరియర్లు పంపించే వ్యాపారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏటా రూ.2 కోట్లపైగా జరుగుతుందని చెప్పారు. దసరా, సంక్రాంతి, పచ్చళ్ల సీజన్లలో గిరాకీ అధికంగా ఉంటుందన్నారు. కరీంనగర్‌లో విదేశాలకు పంపే ప్రధాన కొరియర్ సంస్థలు అయిదు ఉన్నాయి.

సీజన్‌లో అధికంగా..

ఎక్కువగా అమెరికాకు పార్శిళ్లు వెళ్తుంటాయి. రోజువారీగా కొరియర్లు తక్కువగానే ఉన్నా సంక్రాంతి, దసరా పండుగలప్పుడు ఎక్కువగా ఉంటాయి. వినియోగదారుడు పార్సిల్ బుక్ చేసుకున్న తర్వాత అతనికి లింక్ పంపిస్తాం. దాని ద్వారా పార్సిల్ ఎక్కడ ఉంది. డెలివరీ అయిందా? అనే వివరాలు తెలుసుకోవచ్చు. మేము 100కు పైగా దేశాలకు వస్తువులు పంపుతుంటాం. గడ్డం విలాస్‌రెడ్డి, కొరియర్ సంస్థ నిర్వాహకుడు

# మక్కలకు అ'ధర'హో..!



వికారాబాద్: భారీ వర్షాలతో నష్టం వాటిల్లి దిగుబడులు తగ్గినా, బహిరంగ విపణిలో మక్కలకు మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు ఒకింత ఊరట కలుగుతోంది. జిల్లాలో పంట నూర్పిళ్లు జోరుగా కొనసాగుతూ, ఇప్పుడిప్పుడే మక్కలు విపణికి వస్తున్నాయి. వికారాబాద్ వ్యవసాయ విపణికి 250 క్వింటాళ్ల మక్కలు వచ్చాయి. ప్రభుత్వ మద్దతు ధర కంటే మించి బహిరంగ విపణిలో అధిక ధర పలుకుతోంది. దీంతో రైతులకు కలిసి వస్తోంది.

గతంలో నష్టాల పాలు

మక్కలకు ధర లేకపోవడంతో మొక్కజొన్న సాగు చేపట్టకూడదని 2020లో అధికారులు తేల్చి చెప్పారు. అప్పట్లో బహిరంగ విపణిలో మద్దతు ధర కంటే తక్కువగా క్వింటాలుకు రూ.1,200 నుంచి రూ.1,300 వరకు మాత్రమే పలికింది. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధర రూ.1,870 కొనుగోలు చేయడంతో ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లింది. మొక్కజొన్న సాగు చేయవద్దని అధికారులు ప్రచారం చేసినా కొంతమంది రైతులు సాగు చేపట్టి 2021లో నష్టపోయారు.

నల్ల, ఎర్రరేగడి నేలల్లో ఆశాజనకం: 2022 నుంచి ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ఉంటుందని భావించిన రైతులకు అధిక ధర దక్కుతుండటంతో సాగు విస్తీర్ణం ఏయేటికాయేడు పెరుగుతోంది. మొక్కజొన్న సాధారణ దిగుబడి ఎకరాకు 20 క్వింటాళ్లు కాగా, తీవ్ర అతివృష్టి పరిస్థితులతో దిగుబడి ఎకరాకు సగటున 15 క్వింటాళ్లకు పడిపోయింది. వర్షాలకు నీరు నిలిచే ఇసుక, చెల్క, చవుడు భూముల్లో సాగు చేసిన మక్కలకు తీవ్ర నష్టం వాటిల్లి దిగుబడులు సగానికి పైగా తగ్గిపోగా, నల్ల, ఎర్రరేగడి పొలాల్లో మాత్రం ఆశాజనకంగా ఉన్నాయి. వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్ నియోజకవర్గాల్లో వరికి బదులుగా మొక్కజొన్నను ఆరు తడి పంటగా సాగు చేశారు. డిమాండ్ ఉండటంతో రానున్న రోజుల్లో మక్కల ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.


లాభాలు వస్తాయి

రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. రూ.25 వేల పెట్టుబడి పెట్టా. నూర్పిడి చేస్తున్నాం. అధిక వర్షాలకు దిగుబడులు తగ్గి ఎకరాకు 15 క్వింటాళ్ల చొప్పున రావొచ్చని భావిస్తున్నా. బహిరంగ విపణిలో ధర ఆశాజనకంగా ఉండటంతో లాభాలు వస్తాయి. లక్ష్మణ్‌నాయక్, కొటాలగూడ, వికారాబాద్.

# జుడా ఏర్పాటుకు అడుగులు

జగిత్యాల: జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(జుడా) ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. జుడా ఏర్పాటు చేయాలని ఆరేళ్ల కిందట ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం అన్ని జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలోనూ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. మొదట 53 గ్రామాలతో జగిత్యాల, 17 గ్రామాలతో కోరుట్ల, 22 గ్రామాలతో మెట్‌పల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మరోసారి జగిత్యాలలో ఒకటి, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలు 44 గ్రామాలు కలిపి మరో అథారిటీ ఏర్పాటు చేయాలని భావించారు. మరోసారి జిల్లాలోని అన్ని పట్టణాలు, 382 గ్రామ పంచాయతీలను కలిపి ఒకే అథారిటీగా ఏర్పాటు చేయాలని ఆలోచించారు. చివరికి కేవలం జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల 15 కి.మీ పరిధిలోని గ్రామాలను కలిపి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించిన మేరకు జగిత్యాల పట్టణం చుట్టుపక్కల 53 గ్రామాలను కలుపుతూ జుడాను ప్రతిపాదించారు.

ప్రయోజనం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు కానుంది. సంస్థకు ఛైర్మన్‌ను ప్రభుత్వం నియమిస్తుంది. వైస్ ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. గ్రామపంచాయతీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. జుడా పరిధిలోని పట్టణం, గ్రామాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి



పనులు చేపట్టే వీలుంటుంది. రహదారులు, మురుగుకాలువల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు తదితర అభివృద్ధికి నిధులు వస్తాయి. అంతేగాకుండా ప్రణాళిక విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. బహుళ అంతస్థుల నిర్మాణాలు పరిశ్రమల ఏర్పాటు తదితర అనుమతులన్ని జుడా ఇస్తుంది.

జుడాలో జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ఏడు మండలాల్లోని 53 గ్రామాలను ప్రతిపాదించారు.

జగిత్యాల పట్టణం, అర్బన్ మండలం: హస్నాబాద్, అంబారిపేట, మోతె, తిప్పన్నపేట, ధరూర్ గ్రామాలు.

పొలాస, హైదర్‌పల్లి, కండ్లపల్లి, చెర్లపల్లి, హన్మాజిపేట, పోరండ్ల, బాలపల్లి, నర్సింగాపూర్, వంజరిపల్లి, వెల్దుర్తి, గొల్లపల్లి, తిమ్మాపూర్, జాబితాపూర్, ధర్మారం, లక్ష్మిపూర్, అనంతారం, చల్‌గల్, తాటిపల్లి, అంతర్గాం, గుట్టరాజ్‌పల్లి, కన్నాపూర్, తక్కళ్లపల్లి, గుల్లపేట, మోరపల్లి గ్రామాలు. సారంగాపూర్ మండలం: పెంబట్ల, కోనాపూర్, లచ్చక్కపేట, నాగునూరు, రంగపేట, లక్ష్మిదేవిపల్లి, అర్పపల్లి.

మేడిపల్లి మండలం: కాచారం, విలాయతాబాద్, మేడిపల్లి, గుండ్లపల్లి, రంగాపూర్, కట్లకుంట, తొంబరావుపేట గ్రామాలు.

మల్యాల మండలం: రాజారం, పోతారం, రామన్నపేట, నూకపల్లి.

గొల్లపల్లి మండలం: బిబిరాజ్‌పల్లి, వెంగళాపూర్, ఇబ్రహీంనగర్, తిర్మలాపూర్. రాయికల్ మండలం: అల్లీపూర్, కిష్టంపేట గ్రామాలను జుడాలో ప్రతిపాదించారు.

అభివృద్ధికి అవకాశంరాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(జుడా) ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. జిల్లా కేంద్రం సహా చుట్టు పక్కల మండలాల్లోని 53 గ్రామాలను జుడాలో చేర్చాం. జుడా ఏర్పాటుతో గ్రామ పంచాయతీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అథారిటీ పరిధిలోని పట్టణం, గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి చెందే అవకాశం లభిస్తుంది.

బి.సత్యప్రసాద్, కలెక్టర్

# యంత్రాలు మూలకు.. కార్మికులతోనే పనులు

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పారిశుద్ధ్య పనుల నిర్వహణ, శుభ్రతలో పేరుగాంచింది.. దీని పేరు ఇలాగే కొనసాగించి మరింత మెరుగుపర్చేలా అధికార యంత్రాంగం పని చేయాల్సి ఉండగా.. సమీక్షలు సమావేశాలకే పరిమితమవుతూ వాహనాల మరమ్మతులు అటకెక్కించారు. ఇంకేముంది దీని ప్రభావం కొన్ని నెలలుగా కనిపిస్తోంది. నగరంలోని 60 డివిజన్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు, రాత్రి నుంచి వేకువజామున వరకు రెండు విడతలుగా పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. రహదారులు, మురుగుకాలువలు, చెత్త సేకరణ వంటి పనులు చేస్తుండగా ప్రధాన రహదారులు ఊడ్చేందుకు ప్రత్యేక యంత్రాలను ఉపయోగిస్తారు.

ఏడింటిలో అయిదు..నగరంలో 14.5 కిలోమీటర్ల పొడవునా ఉన్న తారు రోడ్లను రెండు వైపులా ఊడ్చేందుకు ఏడు వాహనాలను ఇన్నాళ్లు వినియోగించారు. కమాన్ నుంచి హైదరాబాద్ రోడ్డు, ఎన్టీఆర్ విగ్రహం నుంచి పద్మనగర్ బైపాసు,



బద్దం ఎల్లారెడ్డి విగ్రహం నుంచి రామగుండం బైపాసు రోడ్డు, కమాన్ నుంచి బస్టాండ్ మీదుగా పద్మనగర్ శివారు వరకు, తెలంగాణ చౌక్ నుంచి ఆర్అండ్‌బీ మీదుగా జగిత్యాల రోడ్డు, కోర్టు చౌరస్తా నుంచి మంచిర్యాల చౌరస్తా మీదుగా చొప్పదండి రోడ్డు, మంచిర్యాల చౌరస్తా నుంచి పెద్దపల్లి రోడ్డు, కమాన్ నుంచి తీగల వంతెన రోడ్డుతోపాటు అంతర్గత వీధుల్లోని తారు రహదారులన్నీ ఊడ్చే యంత్రంతోనే ఊడిపించాల్సి ఉంటుంది. మొత్తం ఏడు వాహనాల్లో పెద్దవి 5, చిన్నవి 2 ఉన్నాయి. ప్రస్తుతం పెద్ద వాహనాలు రెండు మాత్రమే పని చేస్తుండగా ఇవి కూడా ఏ సమయంలో నిలిచిపోతాయో తెలియదు.

ఎందుకింత నిర్లక్ష్యం పారిశుద్ధ్య పనులు చేసే ట్రాక్టర్లు, ఆటోలు, ఊడ్చే యంత్రాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉండగా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. అయిదు వాహనాలకు బ్రష్‌లు, బేరింగ్‌లు, సెల్ఫ్ మోటార్లు పాడయ్యాయి. నెలల తరబడి మూలన పడేయడంతో వాటి బ్యాటరీలు కూడా చెడిపోయాయి. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.







## ఔషధాలు, బేబీఫుడ్ స్టాక్ పెట్టుకోండి: రష్యాతో యుద్ధభయం నేపథ్యంలో నాటో దేశాల సూచనలు

రష్యాపై దీర్ఘశ్రేణి ఆయుధాలతో దాడులు చేసేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అనుమతి ఇవ్వడం నాటో కూటమి దేశాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. యుద్ధం ముంచుకొస్తే ఏం చేయాలన్న అంశంపై కొన్ని దేశాలు తమ ప్రజలకు సూచనలు జారీ చేయడం ప్రారంభించాయి. తాజాగా స్వీడన్, ఫిన్లాండ్ తమ ప్రజలకు అవసరమైన సూచనలు చేస్తూ.. లక్షలకొద్దీ బుక్‌లెట్లను పంచిపెట్టాయి. యుద్ధాల వేళ, కమ్యూనికేషన్లు దెబ్బతిన్నప్పుడు, విద్యుత్తు సరఫరా ఆగిపోయిన వేళ ఎలా స్పందించాలనే అంశాలు దీనిలో ఉన్నాయి. ఈ రెండు దేశాలు కొత్తగా నాటోలో చేరిన విషయం తెలిసిందే. మంచినీటి సీసాలు, స్టేషనరీ, ఆహార పదార్థాలను నిల్వ ఉంచుకోవడంపై దీనిలో సూచనలు ఉన్నాయి. యుద్ధ సమయంలో ప్రజలు తమను తాము ఎలా కాపాడుకోవాలని అన్న విషయాలు దీనిలో స్పష్టంగా ఉన్నాయి. పిల్లల పేరెంట్స్, సంరక్షకులు కచ్చితంగా డైపర్స్, ఔషధాలు, చిన్నారుల కోసం ఆహార నిల్వలను ఉంచుకోవాలని సూచించాయి. 'ఒకవేళ యుద్ధం వస్తే' అనే పేరిట స్వీడన్ ప్రభుత్వం 50 లక్షల బుక్‌లెట్లను వచ్చే రెండు వారాల్లో పంపిణీ చేయనుంది. రెండో ప్రపంచయుద్ధం నుంచి ఇటువంటి బుక్‌లెట్లను పంచడం ఇది ఐదోసారి. సోమవారం విడుదల చేసిన దీనిని ఇప్పటికే 55,000 మంది నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్నారు. "ప్రపంచంలో పరిస్థితి కొన్నేళ్ల నుంచి రానురాను దారుణంగా మారుతోంది. మనకు సమీపంలోనే యుద్ధం జరుగుతోంది. టెర్రర్, సైబర్, తప్పుడు సమాచార ముప్పులు పొంచి ఉన్నాయి" అని ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇక ఫిన్లాండ్ కూడా ఇటువంటి కరపత్రాలనే ప్రింట్ చేసి పంపిణీ చేసింది. ఇప్పటికే ఈ దేశంలో 58 శాతం మంది ప్రజలు యుద్ధం వస్తే తట్టుకొనేలా అత్యవసర సామగ్రి కొనుగోలు చేసి నిల్వ చేసుకొన్నట్లు చెబుతున్నారు. నార్వే కూడా ఇటువంటివి 22 లక్షల బుక్‌లెట్లను ముద్రించి ఇంటింటికి పంపిణీ చేసింది.

## మండలిలో రుషికొండ రగడ.. ఆసక్తిగా చూస్తున్న పవన్

అమరావతి, నవంబర్ 19: ఏపీ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. మండలిలోనూ అనేక అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం రుషికొండ భవనాలపై మండలిలో వాడీ వేడీ చర్చ జరిగింది. రుషికొండ భవనాలపై అధికార, ప్రతిపక్ష నేతల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అయితే సభ్యుల మధ్య వాగ్వివాదాలను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆసక్తిగా గమనించారు. రుషికొండపై శాసనమండలిలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ప్రశ్నలు లేవనెత్తారు. "ప్రభుత్వం ఏం చేయబోతుంది. ఏ విధంగా వినియోగించబోతుంది. విశాఖ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు ఏం ఉపయోగమో చెప్పాలి" ఎమ్మెల్సీ కోరారు.

**ఓపెన్ డిబేట్‌కు సిద్ధమా: మంత్రి కందుల దుర్గేష్....** రుషికొండలో నిర్మాణాలకు అనుమతి తీసుకున్నది ఒకటి కట్టింది మరొకటని మంత్రి దుర్గేష్ తెలిపారు. హరిత రిసార్ట్స్ 58 గదులతో ఉండేదని... ఇంతకన్నా అత్భుతమైన నిర్మాణాలు చేస్తామని చెప్పి ప్యాలెస్ కట్టారని.. ఇప్పుడు మొత్తం 7 రూమ్స్ మాత్రమే ఉన్నాయన్నారు. కేటాయింపులు భిన్నంగా భూవినియోగ మార్పిడి జరిగిందని... రుషికొండకు అపారమైన నష్టం కలిగిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసు కోసం అంటూ జీవో విడుదల చేశారన్నారు. " రూ.481 కోట్లు ఖర్చుపెట్టారు. మంజూరు చేసిన మొత్తం రూ.451.67 కోట్లు. రూ.434.28 కోట్లు పనులు చేసి అప్పగించారు. వాటి విలువ రూ.409 .39 కోట్లు. ఇప్పటి వరకు రూ.320.3 కోట్లు చెల్లించారు. ఒక బాత్ టబ్ 12 లక్షలు" అని తెలిపారు. రోమ్ నగరం తగబడుతుంటే రాజు పిడేలు వాయించినట్లు, ఆయన సొంతం కోసం ఇన్ని కోట్లు ఖర్చుపెట్టి నిర్మాణం చేసుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ చెబుతున్నది అబద్ధమా.. కూటమి చెప్తున్నది అబద్ధమా.. ఓపెన్ డిబేట్‌కు సిద్ధమంటూ సవాల్ విసిరారు. కావాలంటే వైసీపీ ఎమ్మెల్సీలను తీసుకువెళ్లి చూపిస్తామని అన్నారు. దీనిపైన కోర్టులో కేసులు ఉన్నాయని... కమీటి వేశారని... వాటి తీర్పు కోసం వేచి చూస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. అయితే మంత్రి వ్యాఖ్యలపై వైసీపీ సభ్యులు నిరసన తెలిపారు.

**బొత్సకూ చూపించలేదు: మంత్రి అచ్చెన్న...** రుషికొండ నిర్మాణం జరుగుతున్న సమయంలో ఎవ్వరికీ చూపించలేదని.. గతంలో మున్సిపల్ మంత్రిగా ఉన్న బొత్స కూడా ఆ భవనాలను చూడలేదని.. ఇప్పుడొస్తే చూపిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అసెంబ్లీ భవనాలు ఎస్ఎఫ్‌టీ 6 వేలకు కట్టారని అప్పట్లో వైసీపీ గగ్గోలు పెట్టిందని.. మరి ఇప్పుడు రుషికొండ ఎస్ఎఫ్‌టీ 26 వేల రూపాయలకు కట్టారని.. వాటితో పేదవాడికి 26 వేల మంది ఇళ్లు కట్టోచ్చని చెప్పారు. ఒక వ్యక్తి కోసం ఇంత డబ్బు ఖర్చు చేశారని మండిపడ్డారు. రుషికొండ వస్తానంటే, వైసీపీ నేతలను బస్సు వేసుకుని తీసుకువెళ్తామన్నారు. అప్పటి ముఖ్యమంత్రి తప్పుచేశారని ఒప్పుకోకుండా ఎదురు దాడిచేస్తున్నారని... ఇది చాలా దారుణమని మంత్రి అచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు.


**అది ప్రభుత్వ భవనమే: బొత్స...** సభలో వైసీపీ ఎమ్మెల్సీ బొత్స మాట్లాడుతూ.. ప్రభుత్వ భవనాలకు ప్రజా ఆమోదం ఎక్కడైనా ఉంటుందా అని ప్రశ్నించారు. రుషికొండ ప్యాలెస్ ప్రభుత్వ భవనమన్నారు. తాజ్ మహాల్ కన్నా బాగుందని కూటమి నేతలే చెప్పారన్నారు. అందులో అవినీతి జరిగితే చర్యలు తీసుకోవాలని.. అందులో ఏం పెడతారో ప్రభుత్వమే నిర్ణయించుకోవాలని అన్నారు. అసెంబ్లీ నిర్మాణానికి చదరపు అడుగుకు 14 వేల రూపాయలు ఖర్చు చేశారని బొత్స తెలిపారు. "మా హయాంలో నిర్మించిన భవనం ప్రభుత్వ భవనం. దాన్ని ఏ విధంగా ఉపయోగించుకుంటారో ప్రభుత్వం ఇష్టం. దమ్ముంటే, రండి చూసుకుందాం అని సభ్యులు ఇలా మాట్లాడటం కరెక్ట్ కాదు" అని బొత్స అన్నారు.

**నేనేమీ వస్తాదును కాను: దుర్గేష్...** అయితే బొత్స వ్యాఖ్యలపై మంత్రి దుర్గేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ముఖ్యమంత్రి కార్యాలయమంటూ జీవో ఇచ్చారని ఆ జీవో చూపిస్తామనే తాను చెప్పానని మంత్రి దుర్గేష్ సమాధానం ఇచ్చారు. "చూపిస్తాం రమ్మని చెప్పాను కానీ చూసుకుందాం అని అనలేదు. నేనేమీ వస్తాదును కాదు చూసుకోవడానికి" అని మంత్రి దుర్గేష్ అన్న మంత్రి దుర్గేష్ కామెంట్స్ చేశారు.




థాయ్‌లాండ్ నుంచి దిల్లీకి బయలుదేరిన ఎయిరిండియా ప్రయాణికులకు చేదు అనుభవం ఎదురైంది. విమానంలో పలుమార్లు సాంకేతిక లోపం తలెత్తడంతో వారంతా 80 గంటలుగా ఆ దేశంలోనే చిక్కుపోయారు. ఈ మేరకు సంఘటనకు సంబంధించి ప్రయాణికులు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు వైరల్‌గా మారాయి. ఎయిరిండియాకు చెందిన ఓ విమానం 100 మందికి పైగా ప్రయాణికులతో నవంబరు 16న థాయ్‌లాండ్ నుంచి దిల్లీకి బయలుదేరింది. టేకాఫ్ అయిన కాసేపటికే దానిలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో గంటల పాటు ప్రయాణికులు వేచి చూడాల్సి వచ్చింది. అలా 80 గంటలుగా థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో చిక్కుకుపోయాం అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. "దిల్లీకి వెళ్లేందుకు ప్రయాణికులంతా సిద్ధమయ్యారు. కానీ, విమానంలో చిన్న సాంకేతిక లోపం తలెత్తినట్లు ఎయిర్‌లైన్స్ మాకు తెలియజేసింది. దీంతో తొలుత ఆరు గంటల పాటు ఎయిర్‌పోర్టులోనే వేచి చూశాం. ఆ తర్వాత సిద్ధంగా ఉన్న విమానంలో మమల్ని ఎక్కించారు. టేకాఫ్ అయిన రెండు గంటల తర్వాత ఫుకెట్‌లో మళ్లీ విమానాన్ని ల్యాండ్ చేశారు. మరోసారి సాంకేతిక లోపం కారణంగానే అత్యవసర ల్యాండింగ్ చేసినట్లు సిబ్బంది తెలిపారు. అలా 80 గంటలుగా ఎయిర్‌పోర్టులోనే చిక్కుకుపోయాం. చిన్నారులు, పెద్దలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు" అని ఓ ప్రయాణికుడు పోస్టు పెట్టాడు. ఈ సంఘటనపై ఎయిర్‌లైన్స్ సంబంధిత వర్గాలు స్పందించాయి. "టేకాఫ్ తర్వాత సాంకేతిక లోపం కారణంగా అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. ప్రయాణికులకు వసతులు కల్పించాం. కొందరిని వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేశాం. మరో 40 మంది ఇప్పటికీ ఫుకెట్‌లోనే ఉన్నారు. మరి కొన్ని గంటల్లో వారిని కూడా సురక్షితంగా పంపించేందుకు ప్రయత్నిస్తున్నాం" అని పేర్కొన్నాయి.

## చంద్రబాబు వినూత్న ఆలోచన.. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి రహదారుల నిర్వహణ



అమరావతి: రహదారుల నిర్వహణపై వినూత్నంగా ఆలోచించానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి రహదారుల నిర్వహణ అప్పగించే యోచన చేస్తున్నట్టు చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేసేందుకు ఆలోచిస్తున్నామని చెప్పారు. "ఐదేళ్లలో రాష్ట్రంలో రహదారులపై లక్షలాది గుంతలు ఏర్పడ్డాయి. రోడ్ల మరమ్మతులకు రూ.850 కోట్లు మంజూరు చేయడంతో పనులు జరుగుతున్నాయి. జనవరిలో పండుగల సందర్భంగా రాష్ట్రానికి ఎవరైనా వస్తే మెరుగైన రహదారులు కనిపించాలనే ఉద్దేశంతో.. దృఢ సంకల్పంతో ముందుకుపోతున్నాం. మన దగ్గర డబ్బుల్లేవు.. ఆలోచనలు ఉన్నాయి. ఒక ఆలోచన దేశాన్ని, ప్రపంచాన్ని మారుస్తుంది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరిజిల్లాల్లో ఉన్న రోడ్ల నిర్వహణ జాతీయ రహదారుల మాదిరిగా టెండరు పిలిచి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి ఇస్తాం. గ్రామం నుంచి మండల కేంద్రానికి ఎక్కడా టోల్ ఫీజు ఉండదు. మిగిలిన చోట్ల టోల్ ఉంటుంది.. అది కూడా బస్సులు, కార్లు, లారీలకు మాత్రమే యూజర్ ఛార్జి ఉటుంది. ఈ విధానం బాగుంటుందని సభ్యులంతా భావిస్తే ప్రయోగాత్మకంగా గోదావరి జిల్లాల్లో అమలు చేద్దాం" అని సీఎం అసెంబ్లీలో ప్రకటించారు.

## మహిళలు, యువతుల అదృశ్యంపై డిప్యూటీ సీఎం పవన్ ట్వీట్..

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వంలో 30 వేల మంది మహిళలు, బాలికలు అదృశ్యమైనా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి ధ్వజమెత్తారు. వారి అదృశ్యంపై ఒక్క ప్రకటనా జగన్ సర్కార్ చేయలేదని ఆయన మండిపడ్డారు. కానీ ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్పు మ్మొదలైందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా 18 మంది మహిళలకు సంబంధించిన మిస్సింగ్ కేసులను ఛేదించిన విజయవాడ సిటీ పోలీసులకు డిప్యూటీ సీఎం పవన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పటిష్టమైన లా అండ్ ఆర్డర్ అమలు చేస్తామని ముందే చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత నేతృత్వంలో కేసులు ఛేదించిన టాస్క్ ఫోర్స్ పోలీసులకు, హోంమంత్రిత్వ శాఖకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం అభినందనలు తెలియజేశారు. ఏపీ పోలీసులను చూసి తాను గర్వపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి అన్నారు. మహిళల భద్రత, వారి హక్కులు పరిరక్షించేందుకు ఏపీ పోలీసులకు సీఎం చంద్రబాబు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని డిప్యూటీ సీఎం చెప్పారు. అలాగే మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టే వారిపైనా కఠిన చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పోలీస్ శాఖకు పూర్తి మద్దతు ఉంటుందని ఆయన చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ పౌరులు సైతం చురుకుగా, అప్రమత్తంగా ఉంటూ మన గ్రామాలు, పట్టణాలు, నగరాలను సురక్షితంగా మార్చుకోవాలని, వాటిని మరింత భద్రంగా మార్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## విశాఖలో అత్యాచార ఘటన.. స్పందించిన హోం మంత్రి



అమరావతి: విశాఖలో లా స్టూడెంట్ అత్యాచార ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. విశాఖ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడిన మంత్రి.. ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యాచారానికి పాల్పడ్డ యువకులను కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ మంత్రికి తెలిపారు. విశాఖలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అనిత తెలిపారు.

## గురుదక్షిణ కోసం శారదా పీఠానికి భూములు: మండలిలో జగన్‌పై మంత్రుల ధ్వజం

అమరావతి: ప్రజాహితం కోసం కాకుండా గురుదక్షిణ పేరిట గత ప్రభుత్వం విలువైన భూములను కారుచౌకగా శారదా పీఠానికి కేటాయించిందని మంత్రులు అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. కేటాయింపుల్లో అన్ని నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో శారదాపీఠం భూకేటాయింపులపై తెదేపా సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. అయితే.. గురుదక్షిణ పదం వాడటంపై ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. కేటాయింపుల్లో ఉల్లంఘనలు ఉంటే చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. అయితే.. నిబంధనలు ఉల్లంఘించి గురువుకు ఇచ్చిన దాన్ని గురుదక్షిణే అంటారని మంత్రులు పేర్కొన్నారు.

## ప్రజల డబ్బుతో విలాసాలను ఎవరూ అంగీకరించరు: మంత్రి కందుల దుర్గేశ



అమరావతి: వైకాపా హయాంలో రుషికొండపై 58 గదుల హరిత రిసార్ట్స్‌ను కూలగొట్టి ప్యాలెస్‌లు నిర్మించారని ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఉన్నవాటి కంటే అద్భుతమైన రిసార్ట్స్ కడతామని చెప్పి.. చివరికి సీఎం నివాసం కోసమని తెలిపారని వివరించారు. శాసన మండలిలో రుషికొండ ప్యాలెస్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ప్రజల డబ్బుతో ఇలాంటి విలాసాలు చేస్తామంటే ఎవరూ అంగీకరించరన్నారు.

మరో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్యాలెస్‌ల నిర్మాణ సమయంలో ఎవర్నీ ఆ దరిదాపులకు కూడా రానీయలేదని గుర్తుచేశారు. కళ్ల ముందు ఇంత డబ్బు దోపిడీ జరిగితే ఊరుకోవాలా?అని నిలదీశారు. అందరినీ తీసుకెళ్లి రుషికొండ నిర్మాణాలు చూపిస్తే ఇంకెవరూ ఇలా మాట్లాడరన్నారు. అంతకుముందు మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రుషికొండ నిర్మాణాల్లో అవకతవకలు జరిగితే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

## మదనపల్లె దస్త్రాల దహనం కేసులో ఎంతటి వారున్నా వదిలిపెట్టం: మంత్రి అనగాని



అమరావతి: మదనపల్లె దస్త్రాల దహనం కేసులో ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. దస్త్రాల దహనం వెనక ఉన్న కుట్రపై శాసనమండలిలో తెదేపా సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. సమాధానం ఇచ్చే క్రమంలో మంత్రి అనగాని.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి పేరును ప్రస్తావించారు. దీనిపై వైకాపా సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో గందరగోళం తలెత్తింది. విచారణ ముగియకుండానే పేరును ఎలా ప్రకటిస్తారని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. సీఐడీ దర్యాప్తులో ఉన్న అంశాల్నే తాను ప్రస్తావించానని మంత్రి అనగాని తెలిపారు. ఈ వ్యవహారంలో దోషులను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

## ఏపీ పోలీసుల విచారణకు గైర్హాజరైన రామ్‌గోపాల్ వర్మ



ఒంగోలు: వివాదాస్పద దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ (ఆర్జీవీ) ఏపీ పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. తనకు 4 రోజుల సమయం కావాలంటూ వాట్సప్‌లో ఒంగోలు పోలీసులకు సమాచారం పంపారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌పై అసభ్య పోస్టులు పెట్టడంతో ఆయనపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. నేడు ఒంగోలు సీఐ కార్యాలయంలో విచారణకు ఆర్జీవీ హాజరుకావాల్సి ఉండగా.. సమయం కావాలంటూ ఆయన సమాచారం పంపారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు 'వ్యూహం' సినిమా ప్రమోషన్ సమయంలో తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా సామాజిక మాధ్యమం వేదికగా రామ్‌గోపాల్ వర్మ పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల తెదేపా ప్రధాన కార్యదర్శి రామలింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా అక్కడి పోలీసులు వర్మపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఈ కేసులో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలంటూ ఆర్జీవీ హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు చుక్కెదురైంది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేమని స్పష్టం చేసింది.

## వైకాపా హయాంలో 450 ఎత్తిపోతల పథకాలు మూత: మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి: రాష్ట్రంలోని ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించామని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో 450 ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల కనీస నిర్వహణను కూడా గత పాలకులు పట్టించుకోలేదని ఆక్షేపించారు. ఎత్తిపోతల పథకాలు, పూడికతీతలపై శాసనసభలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ మంత్రి మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్వహణకు ఏడాదికి రూ.983 కోట్లు కేటాయించాలని ప్రణాళికా సంఘం స్పష్టంగా చెప్పిందన్నారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం కేవలం రూ.125కోట్లు మాత్రమే కేటాయించిందని చెప్పారు. అందుకే జలవనరుల శాఖలో ఇంత విధ్వంసం జరిగిందన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొంటామని వివరించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుర్రపుడెక్క తొలగించేందుకు జూన్‌లో తొలుత రూ.79కోట్లు కేటాయించామన్నారు. అత్యవసర పనుల కోసం రూ.284 కోట్ల నిధులు మంజూరుచేశామని.. ప్రస్తుతం టెండరు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. త్వరలోనే ఆ పనులు కూడా చేపడతామని మంత్రి వివరించారు.

## గ్లామర్‌లో కొత్త ప్రయోగం... ఫారియా నెక్ట్స్ లెవల్ లుక్స్

ఫారియా అబ్దుల్లా తొలి సినిమా "జాతి రత్నాలు"తోనే ప్రేక్షకుల మనసుల్లో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఈ చిత్రంలో తన చిలిపితనంతో, అల్లరి క్యారెక్టర్‌తో కుర్రకారుకు ఫేవరెట్‌గా మారిపోయింది. ఆ తరువాత "రావణాసుర" వంటి సినిమాల్లో నటించినప్పటికీ సరైన గుర్తింపు రాలేదు. కానీ మత్తు వదలరా 2 సినిమా ద్వారా మంచి సక్సెస్ అందుకుంది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ రాబట్టింది. అంతే కాకుండా ఫారియా క్యారెక్టర్ కూడా సినిమాలో బాగా హైలెట్ అయ్యింది. ఇక ఇటీవల ఫారియా తన గ్లామర్ ఫోటోషూట్స్‌తో సోషల్ మీడియాను కుదిపేస్తోంది. తాజాగా పంచుకున్న ఈ ఫోటోలలో ఆమె వైట్ డ్రెస్‌లో అద్భుతంగా మెరిసిపోతోంది. తొలి ఫోటోలో ఫారియా తన కర్లీ



హెయిర్‌తో, స్టన్నింగ్ పోజ్‌తో చూడగానే ఆకట్టుకునేలా ఉంది. ఆమె కళ్ళతోనే అసలైన అందాన్ని హైలెట్ చేస్తోంది. రెండో ఫోటోలో ఆమె తన సింప్లిసిటీ, ఎలిగెన్స్‌ను హైలైట్ చేస్తూ స్టయిలిష్ లుక్‌లో మెరిసింది. బ్లాక్ మరియు వైట్ కాంబినేషన్ బ్యాక్‌గ్రౌండ్ ఈ ఫోటోకు అదనపు అందాన్ని చేకూరుస్తోంది. మూడో స్టిల్‌లో ఆమె నవ్వుతో అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్ ఇస్తూ, తన ఫాలోవర్స్‌ను ముగ్ధులను చేస్తోంది. ఫారియా తనకు తగిన కథానాయక పాత్రల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఇటీవలి కాలంలో ఆమె లేడీ ఓరియెంటెడ్ ప్రాజెక్ట్‌కు సైన్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఒక తమిళ సినిమాతో పాటు మరో తెలుగు ప్రాజెక్ట్‌పై దృష్టి సారించింది. ఇక ఈ ఫోటోలు చూసిన అభిమానులు ఆమె త్వరలో స్టార్ హీరోలతో పెద్ద ప్రాజెక్టుల్లో నటిస్తుందని నమ్ముతున్నారు. ఫారియా గ్లామర్, టాలెంట్ కలిపి మరో "బ్లాక్ బస్టర్" హిట్ అందుకుంటే, టాలీవుడ్‌లో తన స్థానాన్ని మరింత బలపరచడం ఖాయం. ఈ లేటెస్ట్ స్టిల్స్ ఆమె ఫాలోవర్స్‌ను ఎంతగానో ఆకట్టుకుంటుండగా, ఫారియా తన కెరీర్‌లో కొత్త మలుపు తిప్పే దిశగా ముందుకు సాగుతోందని స్పష్టంగా తెలుస్తోంది.

## సినిమా హిట్టవ్వాలని ఉపవాస దీక్ష చేపట్టిన ఫ్లాప్ హీరోయిన్!

టాలీవుడ్ లో హీరోయిన్ గా నిలదొక్కుకోవడానికి గట్టిగా ట్రై చేస్తున్న అందాల భామల్లో కావ్య థాపర్ ఒకరు. 2018లో 'ఈ మాయ పేరేమిటో' అనే చిన్న సినిమాతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ.. తెలుగులో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అందం, అభినయం రెండూ ఉన్నా సరే, అనుకున్నంత క్రేజ్ తెచ్చుకోలేకపోయింది. అవకాశాలు అందుకుంటోంది కానీ, విజయాలు సాధించలేకపోతోంది. 'ఊరి పేరు భైరవకోన' డీసెంట్ గా ఆడినా, 'డబుల్ ఇస్మార్ట్' మూవీ డిజాస్టర్ గా మారింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు 'విశ్వం' సినిమాపైనే బోలెడన్ని ఆశలు పెట్టుకుంది కావ్య. గోపీచంద్, కావ్య థాపర్ జంటగా నటించిన లేటెస్ట్ మూవీ "విశ్వం". శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని దసరా పండగ సందర్భంగా థియేటర్లలోకి రావడానికి రెడీ అయింది. అక్టోబర్ 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమా కచ్చితంగా మంచి హిట్ అవుతుందని, తనకు మంచి పేరు



తెచ్చిపెడుతుందని కావ్య నమ్మకంగా ఉంది. విశ్వం సినిమాలో కాస్ట్యూమ్ డిజైనర్ రోల్ ప్లే చేసింది కావ్య థాపర్. ఆమెది మోడ్రన్ గా ఉండే అమ్మాయి పాత్ర. ఆమె క్యారక్టర్ లో కాస్త గ్రే షేడ్ కనిపిస్తుందని టాక్. ఇప్పటి వరకూ సరైన సక్సెస్ రుచి చూడని ఈ బ్యూటీ.. ఈసారి ఎలాగైనా హిట్టు కొట్టాలని స్ట్రాంగ్ గా ఫిక్స్ అయిపోయింది. అందుకే సినిమా బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించాలని కోరుకుంటూ పూజలు చేయడమే కాదు, ఉపవాస దీక్ష చేపట్టింది. తన లైఫ్ లోనే మొదటిసారిగా నవరాత్రికి సంధర్భంగా తొమ్మిది రోజుల పాటు ఫాస్టింగ్ చేస్తున్నట్లుగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. మరి ఆమె పూజలు ఫలించి విజయ దశమికి మంచి విజయం వరిస్తుందేమో చూడాలి. నిజానికి 'విశ్వం' సినిమా కావ్య థాపర్ తో పాటుగా డైరెక్టర్ శ్రీను వైట్ల, హీరో గోపీచంద్, నిర్మాత విశ్వ ప్రసాద్ కు కూడా కీలకమనే చెప్పాలి. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న గోపీ, హిట్టు కొట్టి మళ్ళీ ట్రాక్ లోకి రావాలని చూస్తున్నారు. దాదాపు ఆరేళ్ల తర్వాత మెగా ఫోన్ పట్టిన శ్రీను వైట్ల.. బ్లాక్ బస్టర్ తో బౌన్స్ బ్యాక్ అవ్వాలని భావిస్తున్నారు. అలానే కమర్షియల్ సక్సెస్ సాధించి లాభాలు వెనసుకోవాలని ప్రొడ్యూసర్స్ చూస్తున్నారు. కాబట్టి వీరందరికీ ఈ సినిమా తప్పకుండా హిట్టవ్వాల్సిన అవసరం ఉంది. ఇకపోతే టాలీవుడ్ మేకర్స్ దృష్టిని ఆకర్షించడానికి, కావ్య థాపర్ తెలుగు భాష మీద పట్టు సాధించడానికి కష్ట పడుతోంది. టీచర్ ను పెట్టుకొని తెలుగు నేర్చుకుంటోంది. 'విశ్వం' సినిమా రిలీజ్ అవ్వకముందే అమ్మడు మరో మూడు కొత్త ప్రాజెక్ట్స్ కు సైన్ చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే వీటికి సంబంధించిన వివరాలు వెల్లడి కానున్నాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది.




## సీక్వెల్‌లో బూతులు తగ్గించారట!



రానా హోస్ట్‌గా అమెజాన్ ప్రైమ్‌లో టాక్ షో రాబోతుంది. 'ది రానా దగ్గుబాటి షో' అనే పేరుతో రాబోతున్న ఈ టాక్ షో ప్రమోషన్స్‌లో భాగంగా రానా పలు మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ బిజీగా ఉన్నారు. రానా వరుసగా సినిమాలు చేయక పోవడానికి కారణం మంచి కథలు రాకపోవడం అంటూ చెప్పుకొచ్చాడు. లీడర్, నేనే రాజు నేనే మంత్రి వంటి మంచి కథలతో వస్తే తప్పకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తాను అంటూ ప్రకటించాడు. అంతే కాకుండా తన నుంచి సినిమాలు, సిరీస్‌లు, ఇలాంటి షోలు రెగ్యులర్‌గా వస్తాయని, తాను అన్ని విధాలుగా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాను అన్నాడు. రానా నాయుడు వెబ్ సిరీస్ తో రానా ఓటీటీ వెబ్ సిరీస్‌లో అడుగు పెట్టిన విషయం తెల్సిందే. బాబాయి వెంకటేష్ తో కలిసి రానా ఆ వెబ్ సిరీస్‌లో నటించాడు. నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అయిన రానా నాయుడు వెబ్ సిరీస్ ను ఫ్యామిలీ ఆడియన్స్ చూసే విధంగా లేదు. ఫ్యామిలీ అంతా కలిసి వెంకటేష్, రానా సిరీస్ చూడాలని కోరుకుంటే అందులో మరీ దారుణంగా బూతులు ఉన్నాయి అంటూ విమర్శలు వచ్చాయి. ఆ విషయమై రానా తాజాగా మాట్లాడుతూ రానా నాయుడు విమర్శలపై స్పందించాడు. బూతుల విషయంలో స్పష్టత ఇవ్వడం జరిగింది. వెబ్ సిరీస్ స్ట్రీమింగ్‌కి ముందే తాము బూతులు ఉంటాయి, ఫ్యామిలీతో కలిసి చూసేది కాదు అంటూ ప్రకటించాం. కానీ కొందరు యూత్ ఫ్యామిలీతో కలిసి చూసి ఇబ్బంది పడ్డారు. దానికి మేము విచారం వ్యక్తం చేస్తున్నాం. ప్రస్తుతం రానా నాయుడు వెబ్ సిరీస్ సీజన్ 2 కొనసాగుతోంది. ఇప్పటికే షూటింగ్‌ను ముగించాం. త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను ముగించి స్ట్రీమింగ్ చేసే అవకాశాలు ఉన్నాయి. దాని స్ట్రీమింగ్ తేదీ పై తన వద్ద ఎలాంటి సమాచారం లేదు అన్నట్లుగా రానా స్పందించారు. సీజన్ పై గురించి మాట్లాడుతూ మరింత ఆకర్షణీయంగా ఉంటుందని హామీ ఇచ్చారు. మొదటి సీజన్‌లో మాదిరిగా కచ్చితంగా బూతులు ఉండవు అని, సీజన్ 2 లో కాస్త బూతులు తగ్గించామని రానా ప్రకటించారు. రానా నాయుడు వెబ్ సిరీస్ సీజన్ 2 ను ఫ్యామిలీతో కలిసి చూసే విధంగా ఉంటుంది అన్నట్లుగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రస్తుతానికి సినిమాలు ఏమీ చేయడం లేదని, మంచి కథ కోసం వెయిట్ చేస్తున్నట్లుగా పేర్కొన్నాడు. త్వరలోనే సినిమాను ప్రారంభిస్తాం అంటూ ప్రకటించాడు. కథ విషయంలో ఫైనల్ కావాల్సి ఉందని పేర్కొన్నాడు. ది రానా దగ్గుబాటి షో తో సరికొత్త టాక్ షో ను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నట్లుగా రానా పేర్కొన్నాడు. రానా ఈ వెబ్ సిరీస్‌ను సొంతంగా నిర్మించారు.


## లేడీ కాప్‌ని ఇలా ఊహించలేదు



సింగం ఫ్రాంచైజీ సినిమాలకు ప్రత్యేకించి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. తమిళ దర్శకుడు హరి రూపొందించిన సౌత్ ఫ్రాంఛైజీ సింగం కి రీమేక్ వెర్షన్ లను తెరకెక్కించడంలో రోహిత్ శెట్టి ఎంతో పాపులరయ్యారు. సింగం థీమ్ తీసుకుని హిందీలో కొత్త కథల్ని రాస్తున్నాడు శెట్టి. పూర్తిగా బాలీవుడ్ నటీనటులతో అద్భుతాలు సృష్టిస్తున్నాడు. సింఘం ఎగైన్ త్వరలో విడుదల కానుంది. ఇది సూపర్-హిట్ ఫ్రాంచైజీ లో మూడో భాగం. సింగం, సింగం 2, సింబా, సూర్యవంశీ లాంటి విజయవంతమైన చిత్రాలను రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ లో అందించాడు. ఈ యూనివర్శ్ లో సింగం ఎగైన్ ఐదవ భాగం. అంటే ఫ్రాంఛైజీలో మూడోది అయినా యూనివర్శ్ లో ఐదవది. ఇటీవల ట్రైలర్ విడుదలైంది. కానీ ఈ ట్రైలర్ కి మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి. పోలీసులు ఒకరికి మించి ఎక్కువమంది కనిపించడమే గాక, వారంతా పాపులర్ స్టార్లు కావడంతో కొంత గందరగోళం నెలకొంది. అలాగే సింగం ఎగైన్ లో దీపికా పదుకొణె లుక్, యాసపైనా నెటిజనులు సెటైర్లు వేస్తున్నారు. పంచ్ లు విసురుతున్నారు. అజయ్ దేవగన్, కరీనా కపూర్, రణవీర్ సింగ్, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్ సహా పలువురు స్టార్లు ట్రైలర్ లో కనిపించగా, దీపిక పాత్రను ఎలివేట్ చేసిన తీరు విమర్శలకు తావిచ్చింది. దీపికా పదుకొనే కాప్ అవతార్ ని 'క్రింజ్' అని కామెంట్ చేసారు. శక్తి శెట్టి అనే కాప్ గా కనిపించే దీపిక పవర్‌ఫుల్‌గా కనిపిస్తుందని అంచనా వేసిన వారు నిరాశపడ్డారు. తన భాష యాస నెటిజనులకు అంతగా నచ్చలేదు. దీంతో ట్రోలర్లు విరుచుకుపడుతున్నారు. రణవీర్ సింగ్ లాగా మారిందని ఒక నెటిజన్ వ్యాఖ్యానించగా, ఈ ట్రైలర్‌కు ఇంటర్వెల్ బ్రేక్ లా మారిందని మరొకరు కామెంట్ చేసారు. అలాగే నయనతార కాప్ లుక్ తో పోలిక చూపిస్తూ కొన్ని ఫోటోలను కూడా నెటిజనులు షేర్ చేసారు. ప్రస్తుతం ఇవన్నీ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి.

## బ్లాక్ చీరలో మతి పోగొట్టే అందం

తెలుగు ప్రేక్షకులకు చిన్నారి పెళ్లి కూతురు సీరియల్‌తో బాల నటిగా పరిచయం అయిన అవికా గోర్ తక్కువ సమయంలోనే మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. హిందీ సీరియల్స్ ద్వారా హిందీలోనే కాకుండా అన్ని చోట్ల మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న అవికా గోర్‌కి హీరోయిన్‌గా తెలుగులో మొదటి అవకాశం దక్కింది. 'ఉయ్యాల జంపాల' సినిమాతో అవికా హీరోయిన్‌గా పరిచయం అయింది. మొదటి సినిమాతో నటిగా మంచి మార్కులు సొంతం చేసుకోవడంతో పాటు, కమర్షియల్‌గా ఆ సినిమా హిట్ సొంతం చేసుకున్న నేపథ్యంలో హీరోయిన్‌గా మంచి సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంది. ఉయ్యాల జంపాల సినిమాతో వచ్చిన సక్సెస్‌ను సద్వినియోగం చేసుకుని పలు ఆఫర్లు సొంతం చేసుకుంది. సినిమా చూపిస్తా మావతో మరో విజయాన్ని ఈ అమ్మడు సొంతం చేసుకుంది. అయితే ఈమె కొన్ని అనవసర ఎంపికల కారణంగా కెరీర్‌లో ఫ్లాప్స్ పడ్డాయి. దాంతో ఆఫర్లు కాస్త తగ్గాయి. ఆ మధ్య కాస్త బరువు ఎక్కువ అయింది అంటూ విమర్శలు రావడంతో దాదాపు



రెండేళ్ల గ్యాప్ తీసుకుని నేచురల్‌గా సన్నబడి మళ్లీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రీ ఎంట్రీతో టాలీవుడ్‌లో కుమ్మేస్తాను అనుకున్న అవికా గోర్‌కి నిరాశే మిగిలింది. అయితే సోషల్ మీడియాలో మాత్రం తన జోరు కంటిన్యూ చేస్తోంది. రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలతో ముద్దుగుమ్మ అవికా గోర్ ఆకట్టుకుంటూ ఉంది. తాజాగా బ్లాక్ చీర కట్టులో మతి పోగొడుతోంది. సాధారణంగా హీరోయిన్స్ స్కిన్ షో చేస్తేనే ఫోటోలు వైరల్ అవుతాయి. చీర కట్టులో క్లీ వేజ్ షో చేస్తూ, నడుము నాభి అందాలను చూపిస్తేనే నెటిజన్స్ లైక్ చేస్తారు. కానీ అవేవి లేకుండా బ్లాక్ చీర కట్టులో నిండుగా కనిపించినా అవికా గౌర్ కి మంచి స్పందన దక్కింది. ఈ ఫోటోల్లో అవికా చాలా బాగుంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తే, ఇంతటి అందమా అంటూ నోరు వెళ్లబెడుతున్న వారు కొంతమంది ఉన్నారు. మొత్తంగా బ్లాక్ చీర కట్టులో అవికా గోర్ మతి పోగొట్టేస్తోంది అంటూ తెగ లైక్ చేస్తూ కామెంట్స్ చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం అవికా ఈ ఫోటోలతో వైరల్ అవుతోంది. ఆ మధ్య ఈమె స్కిన్ షో చేస్తూ, హొయలు పోతూ షేర్ చేసిన ఫోటోలతో పోల్చితే ఈ బ్లాక్ చీర కట్టు ఫోటోలు మరింత అందంగా ఉన్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఈ స్థాయి అందగత్తెకు దక్కాల్సిన ఆఫర్లు దక్కడం లేదు. మరో పదేళ్లు ఈ అమ్మడు సినిమాలు చేయగల సత్తా ఉంది. కానీ ఆఫర్లు మాత్రం అంతంత మాత్రంగానే వస్తున్నాయని ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సంయుక్త మీనన్.. జాక్ పాట్ కొట్టేసిందిగా..

సౌత్ సినిమా ఇండస్ట్రీలో సంయుక్త మీనన్ తన ప్రత్యేకమైన గుర్తింపును సృష్టించుకుంటోంది. ఇప్పటి వరకు తాను చేసిన పాత్రలతోనే ప్రేక్షకులను మెప్పించిన ఈ అందాల భామ, ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ సినిమాతో వస్తోంది. సాధారణంగా గ్లామర్ హీరోయిన్స్ నాయికా ప్రాధాన్యత ఉన్న చిత్రాల వైపు కేవలం తమ కెరీర్‌లో ఒక స్థాయిని చేరుకున్న తర్వాతే మొగ్గు చూపుతారు. అయితే సంయుక్త, తన కెరీర్ ప్రారంభంలోనే ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని, ఈ కొత్త ప్రయోగంలోకి అడుగుపెట్టింది. రాజేష్ దండా నిర్మాణంలో హాస్య మూవీస్ పతాకంపై ఈ లేడీ ఓరియెంటెడ్ సినిమాను రూపొందిస్తున్నారు. రాజేష్ ప్రస్తుతం సందీప్ కిషన్‌తో 'మజాకా' అనే సినిమా తీస్తున్నారు. 'మజాకా' పూర్తయిన వెంటనే సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలో రూపొందించే ఈ కొత్త సినిమాను పట్టాలెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి యోగేష్ దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవం లాంఛనంగా జరగనుంది. సంయుక్త ఈ సినిమా



లో ప్రధాన పాత్ర పోషించనుండగా, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వార్తలు పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి. ఉన్నత స్థాయి కథతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో సంయుక్త మీనన్ నటనకు మంచి అవకాశం ఉందని తెలుస్తోంది. కథ వినగానే రెండు రోజుల్లోనే సంయుక్త ఈ ప్రాజెక్ట్‌కి ఓకే చెప్పిందట. కథా నేపథ్యంలో కొత్తదనం ఉండటమే కాకుండా, తన పాత్రకు గల ప్రాధాన్యత సంయుక్తను ఆకట్టుకున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని 2025 వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

ఈ లేడీ ఓరియెంటెడ్ సినిమా కోసం నిర్మాత రాజేష్ దండా భారీ బడ్జెట్ కేటాయించారని సమాచారం. దాదాపు రూ. 15 కోట్లతో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు నిర్మాత వెనుకాడడం లేదని తెలుస్తోంది. ఒక లేడీ ఓరియెంటెడ్ సినిమాకి ఇంత భారీ బడ్జెట్ కేటాయించడం కొంత అరుదైన విషయం. ఇది చిత్రంపై ఉన్న అంచనాలను మరింత పెంచు తోంది. ఇది మాత్రమే కాకుండా, సంయుక్త ప్రస్తుతం లారెన్స్‌తో ఒక ప్రాజెక్ట్‌లో భాగమైంది.

అలాగే, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న మరో సినిమాలో కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ రెండు సినిమాల్లోనూ గ్లామర్‌తో పాటు నటనకు పెద్దపీట వేసిన పాత్రలు దక్కించుకోవడం ఆమె కెరీర్‌లో మరొక కీలక మలుపుగా చెప్పవచ్చు.

